ప్రజాశక్తి

బుధవారం 1 ఫిబ్రవరి 2023 8 పేజీలు





గుంటూరు పల్నాడు

బడ్జెట్‌పై గంపెడాశలు

- పన్ను మినహాయింపుల కోసం వేతన జీవుల ఎదురుచూపులు
- రైల్వే ప్రాజెక్టులకు దక్కని మోక్షం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2023-24 ఆర్థిక సంవత్సరానికి లోక్‌సభలో బుధవారం ప్రవేశపెట్టనున్న వార్షిక బడ్జెట్‌పై ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజల్లో ఆసక్తి నెలకొంది. రాయితీలపై వివిధ తరగతుల ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఐదేళ్లుగా నిరీక్షిస్తున్న ఆదాయపు పన్ను మినహాయింపులు ఈసారైనా దక్కుతాయో లేదోనని చూస్తున్నారు. ప్రస్తుతం రూ.2.5 లక్షల వరకే మినహాయింపు ఉండగా దీన్ని కనీసం రూ.ఐదు లక్షల వరకైనా కావాలని కోరుతున్నారు. ఈ అంశంపై నాలుగేళ్లుగా ఉద్యోగులు, అధికారుల ఆశలు, వ్యాపారుల ఆశలపై నీళ్ల చల్లుతున్నారు. సెక్షన్ 80సి కింద ఉన్న మినహాయింపులను రూ.లక్షన్నర నుంచి రూ.3 లక్షల వరకు పెంచాలని చెల్లింపుదారులు కోరుతున్నారు.

ప్రస్తుతం రూ.2.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఆదాయం ఉంటే 10 శాతం, రూ. 5 లక్షల వరకు రూ.10 లక్షల వరకు 20 శాతం, రూ.10 లక్షల దాటితే 30 శాతం పన్ను

▶ 2లో

రైల్వే ప్రాజెక్టులపై దోబూచులాట



రైల్వే బడ్జెట్ బడ్జెట్‌లో జిల్లాలోని రైల్వేల అభివృద్ధికి ఏ మేరకు కేటాయింపులు దక్కుతాయన్నదీ ప్రశ్నార్థకంగా మారింది. గుంటూరు డివిజన్ పరిధిలో రైల్వే లైన్లకు 2022-23 ఆర్థిక సంవత్సరంలో మొక్కుబడి కేటాయింపులే వచ్చాయి. గుంటూరు-గుంతకల్లు రైల్వే మార్గం డబ్లింగ్, విద్యుద్దీకరణ పనులకు రూ.803 కోట్లు, నడికుడి-శ్రీకాళహస్తి నూతన రైల్వే నిర్మాణానికి రూ.150 కోట్లు కేటాయించారు. ఈ లైను నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా 50 శాతం నిధులు కేటాయించకపోవడం వల్ల ఈ పనులు 15 నెలల క్రితం నిలిపేశారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.1350 కోట్లు ఇవ్వాలని రైల్వే వర్గాలు తెలిపాయి. రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వలేదని మొత్తం కేంద్రం భరించి నడికుడి-శ్రీకాళహస్తి నిర్మాణం పూర్తి చేయాలని ప్రతిపాదన

▶ 2లో



జిజిహెచ్‌లో విద్యార్థినులను పరామర్శిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

బాధ్యులపై కఠిన చర్యలు

- మంత్రులు రాంబాబు, రజిని
- జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులకు పరామర్శ

ప్రజాశక్తి - జిల్లా ప్రతినిధిగుంటూరు

పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలంలోని రామకృష్ణాపురం గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థినులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజని చెప్పారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను

▶ 2లో

బ్యాంకు అధికారుల ఒత్తిడి వల్లే ఆత్మహత్య

మృతుడు అమరా వెంకటేశ్వరరావు భార్య అరుణ



ప్రజాశక్తి - నరసరావుపేట

బ్యాంకు అధికారుల వల్లే తన భర్త ఆత్మహత్యకు పాల్పడినట్లు అమరా వెంకటేశ్వరరావు భార్య అరుణ ఆరోపించారు. ఆసత్రి వద్ద మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ కాలేజీ ఏర్పాటు కోసం 2009లో కెనా బ్యాంకు నుండి రూ.13 కోట్లు తీసుకున్నారని, అయితే పలు రకాల వడ్డీలతో రుణ చాలా పెరిగిందని చెప్పారు. 2017 వరకు రూ.25 కోట్లు చెల్లించినా ఇంకా రూ.16 కోట్లు చెల్లించాల్సి వచ్చిందని చెప్పారు. అనివార్య కారణాల వల్ల ఆ మొత్తాన్ని చెల్లించలేకపోయామని, అందుకని రూ.40 కోట్ల విలువైన తమ కళాశాల ఆస్తులను రూ.11 కోట్లకు బ్యాంకు వేలం వేసిందని తెలిపారు. కాలేజీలో రూ.15 కోట్ల సామగ్రి ఉందని, దాన్ని అమ్మి రుణం చెల్లిస్తానని తన భర్త చెప్పినా బ్యాంకు అధికారులు వినకుండా కాలేజీని సీజ్ చేశారని చెప్పారు. కాలేజీ ఆస్తిని తక్కువ ధరకు కాజేయాలనే దురుద్దేశంతోనే బ్యాకుం అధికారులు ఈ వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై విజయవాడ, బెంగళూరు బ్యాంక్ ఉన్నతాధికారులను సంప్రదించినా ఫలితం లేపోయిందన్నారు. కాలేజీని సీజ్ చేసిన సమయంలో అందులో చదువుతున్న విద్యార్థుల ధ్రువపత్రాలను తీసుకోవడానికి అనుమతి కోరినా బ్యాంక్ అధికారులు ససేమిరా అన్నారని, వీటన్నింటితో తన భర్త తీవ్ర మనస్థాపానికి గురయ్యారని చెప్పారు.



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి, వెనక ముసుగుల్లో నిందితులు

వేయకుండానే వేసినట్లు..

- బంగారం కొనుగోలులో ఆన్‌లైన్ చెల్లింపు పేరుతో మోసం
- ఇద్దర్ని అరెస్టు చేసిన పోలీసులు - బంగారం స్వాధీనం

ప్రజాశక్తి - తెనాలి

బంగారం కొనుగోలు చేసే క్రమంలో నగదును ఆన్‌లైన్‌లో చెల్లిస్తున్నట్టు చెప్పి మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని, అతని వద్ద అదే బంగారాన్ని కొనుగోలు చేస్తున్న మరో షాపు మేనేజర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు వివరాలను డీఎస్పీ కె.స్రవంతిరాయ్ తన కార్యాలయంలో మంగళవారం వెల్లడించారు. బాపట్ల జిల్లా ముప్పవరం మండలం, జాగర్లమూడివారిపాలేనికి చెందిన ఉదరగుడి అశోక్ ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో బంగారపు షాపులకు వెళ్లి బంగారం కొనుగోలు చేసి, నగదును ఆన్‌లైన్‌లో చెల్లిస్తున్నట్లు నమ్మిస్తున్నాడు. వాస్తవానికి ఆన్‌లైన్‌లో నగదు బదిలీ అయ్యిందనే స్టేట్‌మెంట్‌ను ముందుగానే తయారు చేసి దాన్ని షాపువారికి చూపుతూ మోసం చేస్తున్నాడు. ఇలా కొనుగోలు చేసిన బంగారాన్ని విజయవాడ హిందుస్థాన్ గోల్డ్ కంపెనీలో మేనేజర్‌గా పని చేసే

▶ 2లో



అర్హులందరికీ సంక్షేమ ఫథకాలు : మద్దాలి గిరి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో గడప-గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగ మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే మద్దాలి గిరి అద్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింప చేస్తామన్నారు. 39 వ డివిజన్ కార్పొరేటర్ షేక్ జుమ్మాభి - మార్కెట్ బాబు గారి నేత్రుత్వంలో 107 వ సచివాలయం లో మొదటి రోజు గుజనగుండ్ల ఆంజనేయ స్వామి గుడి వద్ద నుండి ప్రారంభించారు. డిప్యూటి మేయర్ షేక్ షజీలా పాల్గొన్నారు. సమస్యలు ఉంటె వాటిని సదరు అధికారుల ద్వారా అక్కడిక్కడే పరిష్కరించే విధంగా మద్దాళి గిరి అధికారులకు ఆదేశించారు. 39వ డివిజన్ కార్పొరేటర్ షేక్ జుమ్మభి - మార్కెట్ బాబు, 39వ డివిజన్ ప్రెసిడెంట్ షేక్ షఫి, మాజీ కార్పొరేటర్ ఉడతా కష్ణ, పోగుల వెంకటేశ్వర్లు, గుర్రాల వెంకటేశ్వర్లు, %ఖుఎఅ% మధు, గోపిసేట్టి మధు, చెరుకూరి వెంకటేశ్వర్లు, మస్తాన్ వలి, పిల్లుట్ల మోహన్ గురుస్వామి, కొండే బోయిన శ్రీను పాల్గొన్నారు.



బహుముఖ ప్రజ్ఞాశాలి సోమేపల్లి సాం బయ్య

ప్రజాశక్తి - చిలకలూరిపేట

బహుముఖ ప్రజ్ఞాశాలి, మాజీ ఎమ్మెల్యే సోమేపల్లి సాం బయ్య అని వైసిపి కృష్ణ, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల కోఆర్డినేటర్, మాజీ శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ కొని యాడారు. 22వ వర్ధంతి సందర్భగా స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద గల వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, సోమేపల్లి సాంబయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇరిగేషన్ ద్వారా వ్యవసాయ భూములకు నీరు అందించడమే కాకుండా పట్టణంలో ఆయా కాలనీలకు తాగునీరు అందించిన ఏకైక వ్యక్తి సాంబయ్య అని అన్నారు. దేశ స్థాయి రైతు నాయకుడిగా ఎదిగిన సాంబయ్యకు రైతు బిడ్డగా రైతుల, ప్రజల కష్టాలు తెలుసని చెప్పారు.

విప్పర్లపల్లిలో 'కుష్టు'పై అవగాహన

ప్రజాశక్తి-రొంపిచర్ల



మండలంలో విప్పర్లపల్లిలో కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రతి సంవత్సరం జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు నిర్వహిస్తారు. ప్రతి ఒక్కరూ ఈ వ్యాధిపై అవ గాహన కలిగి ఉండాలని సిహెచ్ఒ చంద్రశేఖర్ అన్నారు. 'చేయి చేయి కలుపుదాం కుష్టు వ్యాధిని పార దోలుదాం' అనే నిదానంతో ముందుకు సాగు దామని చెప్పారు. ఈ వ్యాధి లక్షణాలను ఎలా గుర్తించాలో వివరించారు. హెల్త్ సూపర్ వైజర్ రామయ్య, హెల్త్ అని స్టెంట్లు రాము, కిరణ్ కుమార్, సురేష్, గ్రామసచివాలయ హెల్త్ అసిస్టెంట్ జె.రాజ్యలక్ష్మీ, ఎంపిహెచ్ పి ఝాన్సీ రాణి, ఎఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వెల్లివిరిసిన కళా ప్రతిభ

- విజయవాడలో ముగిసిన అమరావతి బాలోత్సవం
- 161 పాఠశాలల నుంచి వేలాది మంది విద్యార్థుల సందడి

ప్రజాశక్తి-వన్‌టౌన్

విజయవాడ కొత్తపేటలోని పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజనీరింగ్ కాలేజిలో జరుగుతున్న అమరావతి బాలోత్సవం 5వ పిల్లల పండుగలో చిన్నారుల కళా ప్రతిభ వెల్లివెరిసింది. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, ఏలూరు జిల్లాలకు చెందిన 161 పాఠశాల నుంచి 7,600 మంది విద్యార్థిని విద్యార్థులు వివిధ సాంస్కతిక కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను చాటారు. మూడు రోజుల పాటు జరిగిన బాలోత్సవంలో చివరి రోజు మంగళవారం పలు వేదికలపై జరిగిన కార్యక్రమాలలో పిల్లలు పాల్గొని అలరించారు. దేశభక్తి గీతాలాపనలో సీనియర్స్ విభాగంలో పలువురు విద్యార్థులు దేశభక్తిని చాటే విధంగా పలు గీతాలు ఆలపించారు. 'జయ జయ జయహో' దేశభక్తి చాటుతూ భరతమాత పాటను సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఆలపించారు. "భరతమాత పాదాలకు మువ్వలం.. దేశమాత పాదాలకు మువ్వలం", "తేనెల తేటలు మాటలతో" గన్నవరంకు చెందిన స్రవంతి పాఠశాల విద్యార్థినిలు శ్రోతలను అలరించారు. విచిత్ర వేషధారణ జూనియర్స్ విభాగం నుంచి చరిత్రను వివరిస్తూ ఝాన్సీ లక్ష్మీబాయి, వీర పాండ్య కట్ట బ్రహ్మన్న వేషధారణ, శ్రీకష్ణదేవరాయల వేషధారణ, రుద్రమదేవి, మన జాతీయ పక్షి నెమలి వంటి విచిత్ర వేషధారణల్లో చూపర్లను కట్టిపడేశారు. కోలాటం సీనియర్ విభాగంలో నిర్వహించిన పోటీలు ఆద్యంతం చూపరులను ఆకట్టుకు న్నాయి. విద్యాధరపురం రవీంద్ర భారతికి చెందిన షేక్ అహ్మద్ డాక్టర్ బాబ సాహెబ్ అంబేద్కర్‌లా తన నటనతో అలరించారు. సబ్ జూనియర్స్ విభాగంలో రైమ్స్ తెలుగు, ఇంగ్లీష్ తమ ముద్దు ముద్దు మాటలతో ఆకట్టుకున్నారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో వక్తృత్వం తెలుగు, ఇంగ్లీషులలో, పద్య భావం, క్విజ్, డిబేట్, తెలుగులో మాట్లాడటం వంటి పోటీలలో పిల్లలు తమదైన శైలిలో ప్రతిభను చాటారు.







మట్టితో బొమ్మల తయారీ

కళాశాల ప్రాంగణంలో 300 మంది విద్యార్థులు పాల్గొని మట్టితో తమ ప్రతిభను కనబరుస్తూ వివిధ రకాల బొమ్మలను తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా మట్టి బొమ్మల తయారు చేస్తున్న సందర్భంగా బాలోత్సవ నిర్వాహకురాలు పి.జ్యోత్స్న, నలంద ఎస్ఎస్ఎస్ ఇన్‌చార్జ్ కెవిఆర్ పర్యవేక్షించారు. విద్యార్థులు మట్టితో చేసిన బొమ్మలలో చూపరులను ఆకట్టుకుంది. వివిధ రకాల పండ్లు, మొక్కలతో, పార్కు, వాహనాలు, విమానం, వినాయకుని ప్రతిభలు, బోటు, పండుగ శోభను సంతరించుకునేలా పల్లెటూరి వాతావరణంలో బొమ్మలను తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమాలను బాలోత్సవ ప్రధాన కార్యదర్శి రామిశెట్టి కొండలరావు, అధ్యక్షులు ఎస్.పి.రామరాజు, గౌరవాధ్యక్షులు చలువాది మల్లికార్జునరావు, ఆఫీస్ బేరర్స్ మురళీకృష్ణ, యార్లగడ్డ సుబ్బారావు, జ్యోత్స్న, గుమ్మా సాంబశివరావు, వెన్నా వల్లభరావు, ఎ.వి రామరాజు, గోళ్ల నారాయణరావు పర్యవేక్షించారు.

టిడిపి ఆధ్వర్యంలో మొక్కలు నాటిన జీవి

అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - వినుకొండ

పచ్చని చెట్లను నరకడం దుర్మార్గమని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. 'జగనన్న చేదోడు' కోసం సిఎం జగన్ సోమవారం వినుకొండకు వచ్చిన విష యం తెలిసిందే. ఈ నేపథ్యంలో పట్టణంలోని భారీ వృక్షాలను నరికివే యడం విదితమే, దీనిని నిరసిస్తూ వినుకొండలో టిడిపి ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. వినుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సిఎం హెలి ప్యాడ్ కోసం నరికివేసిన చెట్ల స్థానంలో మొక్క లు నాటుతుండగా వినుకొండ సిఐ అశోక్ బాబు, ఎస్సైలు వచ్చి మొక్కలు నాటడానికి వీల్లేదంటూ అడ్డుకున్నారు. ఆ ప్రాంతంలో మొత్తం నాలుగు మొక్కలను ఆంజనేయులు నాటారు. అనం తరం ఆంజనేయులు మాట్లా డుతూ పర్యా వరణాన్ని కాపాడేందుకు మొక్కలు నాటుతుంటే ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పోలీసులను అడ్డుపెట్టుకొని ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవడం దుర్మార్గమని విమర్శించారు. వినుకొండకు అనేకమంది సిఎంలు వచ్చారు కానీ ఇలా చెట్లు నరికిన సందర్భాలు లేవని విమర్శించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అవినీతి అక్రమాలతో దోచుకున్న వేల కోట్లలో వాటా కోసం వినుకొండకు సిఎం వచ్చినట్లు ఉందని ఆరోపించారు. 'జే' బ్రాండ్లతో ప్రజారోగ్యంతో సిఎం ఆడుకుంటున్నా రని, పల్నాడు జిల్లాలో 15 వేలకు పైగా బెల్ట్ షాపులు ఉన్నాయని, నాసిరకం మద్యం బ్రాండ్లతో జిల్లాలో ఇప్పటికీ పదివేల మంది మరణించారని చెప్పారు. సమాజాభివృద్ధికి యువకుడిలా పనిచేస్తున్న చంద్రబాబును 'ముసలాయన 'అంటూ సిఎం సంబోధించడం విడ్డూరమన్నారు.

బాధ్యులపై కఠిన చర్యలు


(మొదటి పేజీ తరువాయి)

మంత్రులు మంగళవారం వేర్వేరుగా పరామర్శించారు. సంఘటనకు బాధ్యులైన ముగ్గుర్ని సస్పెండ్ చేసినట్లు తెలిపారు. మరో 24 గంటల్లో నివేదిక రాగానే బాధ్యులైనవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి రజిని చెప్పారు. ఘటన జరిగిన వెంటనే బాధితులందర్నీ సత్తెనపల్లి ఆస్పత్రికి తరలించడంతోపాటు అక్కడికి ఐదుగురు చిన్న పిల్లల వైద్య నిపుణులు, స్టాఫ్ నర్సు, పారా మెడికల్, నర్సింగ్ సిబ్బందిని పంపించి వైద్యం అందించామన్నారు. ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్యం విషయంలో ప్రమాదమేమీ లేదని, ఆరోగ్యం మెరుగైన వారిలో 101 మందిని ఇంటికి పంపించామని, సత్తెనపల్లిలో మరో 94 మంది చికిత్స పొందుతున్నారని, ప్రాణాపాయమేమీ లేదని చెప్పారు. గురుకుల పాఠశాలను కలెక్టర్ జెసి పరిశీలించడంతోపాటు విద్యార్థినుల ఆరోగ్యంపై సిఎం కార్యాలయం నిత్యం పర్యవేక్షిస్తోందని తెలిపారు. కమిటీ నివేదిక ఇచ్చిన వెంటనే 'నా మనుషుల.. మీ వారా అనేది చూడం... ఎంతటి వారైనా వదిలేది లేదు.. అని మంత్రి అంబటి వ్యాఖ్యానించారు. ఈలాంటి సంఘటనలు జరిగినప్పుడు రాజకీయాలు చేయడం మానుకోవాలని, ఆధారాల్లేకుండా బురద చల్లొద్దని అన్నారు. పరామర్శించిన వారిలో ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్యవరప్రసాద్, లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాల గిరిధర్, నంబూరు శంకరరావు, గుంటూరు, పల్నాడు కలెక్టర్లు ఎం.వేణుగోపాలరెడ్డి, ఎల్.శివశంకర్, ఎస్పిలు ఆరీఫ్ హఫీజ్, రవిశంకర్‌రెడ్డి ఉన్నారు.

వేయకుండానే వేసినట్లు..

(మొదటి పేజీ తరువాయి)

కొలచిన శ్రీనివాస్ అలియాస్ శ్రీనివాసరావుకు కమీషన్ ఇస్తూ అమ్ముతున్నాడు. ఈ క్రమంలో పలు పోలీసు స్టేషన్‌లో పరిధిలో మోసాలకు గురైన వారు పోలీసులను ఆశ్రయించారు. తెనాలి టూ టౌన్ పోలీస్ స్టేషన్, మంగళగిరి టౌన్ పోలీస్ స్టేషన్‌లో, విజయవాడ సిటీ, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, గుంటూరు లాలాపేట, ఒంగోలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లలో కూడా కేసులు నమోదయ్యాయి. ఆయా కేసుల్లో మొత్తం 334 గ్రాములు బంగారం పోయినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో నిందితులను గుర్తించి, ఇద్దర్నీ అరెస్ట్ చేసి వారి నుంచి తెనాలి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో 24 గ్రాములు, ఒంగోలు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో 56 గ్రాముల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అపహరణకు గురైన బంగారం విలువ రూ.18 లక్షలుంటుందని, దానిలో రూ.4 లక్షల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ వివరించారు. నవూవేశంలో టూ టౌన్ సిఐ ఎస్.వెంకట్రావు, ఎన్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



బడ్జెట్‌పై గంపెడాశలు

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించాల్సి వస్తుంది. ఈ మూడు పాయింట్లలో కొంత మినహాయింపులను కోరుతున్నారు. ప్రధానంగా దిగువ స్థాయి ఉద్యోగులు, అధికారులు కనీసం 5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు చెల్లించే 20 శాతం పన్నును అయినా తగ్గించాలని కోరుతున్నారు. కొంత మంది సీనియర్ ఉద్యోగులు, అధికారులు తమకు వచ్చే వేతనంలో ఏడాదికి సగటున రెండు నెలల వేతన సొమ్ము ఆదాయపు పన్నుకే పోతోందని వాపోతున్నారు.

నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించేందుకు వివిధ వస్తువులపై పన్నుల తగ్గింపు, మినహాయింపులు బడ్జెట్లో ఉంటాయా? లేదా పన్నులు పెరుగుతాయా? అనేదీ చర్చనీయాంశంగానే ఉంది. మహిళలు, విద్యార్థులకు, పారిశ్రామిక వేత్తలకు లభించే రాయితీలపైనా ఉత్కంఠ ఏర్పడింది. 2022-23 వార్షిక బడ్జెట్‌లో ఆశించిన స్థాయిలో ప్రయోజనాలు కల్గలేదని ప్రజల నుంచి పెదవి విరుపులే కన్పించాయి. వంటనూనెలు ధరలు ఇంకా పూర్తిగా అదుపులోకి రాలేదు. గతేడాది ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని సాకుగా చూపి నూనె ప్యాకెట్ లీటరు రూ.200 వరకు పెరిగింది. తరువాత ధరలు కొంత తగ్గి ప్రస్తుతం రూ.155 నుంచి రూ.165 వరకు ఉన్నాయి. వస్త్రాలు, చెప్పులు, బూట్లపైనా ఇటీవల జిఎస్‌టి పెంచడం వల్ల వీటి ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. ఈ క్రమంలో ముఖ్యమైన వస్తువులపై ధరలు తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

రైల్వే ప్రాజెక్టులపై దోబూచులాట

(మొదటి పేజీ తరువాయి)

పంపామని ఎంపి లావు శ్రీకృష్ణదేవ రాయులు తెలిపారు. కానీ కేంద్ర ప్రభుత్వం నుంచి సానుకూలత రాలేదు.

గత బడ్జెట్‌లో అమరావతి రైల్వే లైనుకు కేవలం రూ.వెయ్యి మాత్రమే ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. మొత్తం రూ.2679 కోట్లు అంచనాలతో తలపెట్టిన అమరావతి నూతన రైల్వే లైన్లు నిర్మాణానికి 2016లోనే బడ్జెట్‌లో ప్రతిపాదించగా ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. మూడు రాజధానుల ప్రతిపాదనల నేపథ్యంలో అమరావతి రైల్వే లైను గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. అందువల్లే గత బడ్జెట్‌లో రూ.వెయ్యి మాత్రమే కేటాయించి ఈ ప్రాజెక్టు మూసివేయలేదని జీవశ్చంగా మార్చారు. నల్లపాడు-పగిడిపల్లి రైల్వే లైను డబ్లింగ్ 160 కిలో మీటర్ల వేగంతో డిపిఆర్ తయారు చేయాలని నిర్ణయించారు. తెనాలి మార్గంలో నందివెలుగు వద్ద ఆర్ఒబి నిర్మాణానికి రూ.2 కోట్లు ఇచ్చారు. ఈ బ్రిడ్జికి రైల్వే శాఖ చేయాల్సిన పనులు పూర్తయినా రాష్ట్ర ప్రభుత్వం ఆర్అండ్‌బి ద్వారా చేయాల్సిన పనులు నిలిచిపోవడంతో పనులు మందకొడిగా సాగుతున్నాయి. జిల్లాలోని వివిధ మార్గాల్లో ఆర్‌యుబి, ఆర్‌వోబిల నిర్మాణం కాగితాలకే పరిమితమైంది.

బహిరంగంగా మద్యం తాగితే చర్యలు తప్పవు : ఎస్ఐ

ప్రజాశక్తి - మంగళగిరి

నగర పరిధిలో రోడ్ల పక్కన బహిరంగంగా మద్యం సేవిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పట్టణ ఎస్ఐ మహేంద్ర హెచ్చరించారు. నగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయం సమీపంలోని దుకాణాల సముదాయం ఎదుట మందు బాబులు ప్రతినిత్యం మద్యం సేవిస్తున్నారు. మద్యం మత్తులో ఒక్కోసారి సీసాలు పగులగొట్టి హల్ చల్ చేస్తోన్నారు. స్థానిక ప్రజలు ఇచ్చిన సమాచారం మేరకు మంగళవారం పట్టణ ఎస్ఐ తన సిబ్బందితో చేరుకుని బహిరంగంగా మద్యం సేవిస్తున్న ముగ్గురి మద్యం బాబులను అదుపులోకి తీసుకుని స్టేషన్ కు తరలించారు. చట్ట వ్యతిరేక మైన పనులు ఎవరు చేసినా ఉపేక్షించేది లేదన్నారు. ప్రజలు చుట్టుపక్కల జరుగుతున్న చట్టవ్యతిరేకమైన కార్యకలాపాల పై పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

గంజాయి బ్యాచ్ ఆగడాలు

ప్రజాశక్తి-తాడేపల్లి :తాడేపల్లి పట్టణంలో గంజాయి బ్యాచ్ ఆగడాలు రోజురోజుకీ మితిమీరిపోతున్నాయి. తమకు అడిగినంత డబ్బులు ఇవ్వకపోయినా, గంజాయి సరఫరా చేయకపోయినా చంపడానికి కూడా సిద్ధమవుతున్నారు. పట్టణంలోని లంబాడిపేట కేంద్రంగా నిలిచి చర్చనీయాంశమవుతోంది. పనీపాటాలేని జులాయిలకు, జూదరులకు ఇది కేంద్రంగా మారింది. మంగళవారం గంజాయి సేవించడానికి అడిగినంత డబ్బులివ్వలేదని ఓ వ్యక్తిపై దాడి చేశారు. బీరు సీసా పగలగొట్టి పొట్టమీద రక్తం వచ్చేటట్లు పొడిచారు. ఈ ఘటనతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. మూకుమ్మడి పేటలోని వాళ్లందరూ తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సిఐ సాంబశివరావు ముందు తమ గోడు వెళ్లబోసుకున్నారు. గొట్టుముక్కల నాని అనే యువకుడు మత్తు పదార్థాలు ఇప్పించలేదని మరో యువకుడు లక్ష్మణ్‌పై దాడి చేశాడు. సమయం సందర్భం లేకుండా వేరే ప్రాంతాల నుండి విజయవాడ తదితర ప్రాంతాల నుంచి కూడా గంజాయి బ్యాచ్ ఈ ప్రాంతానికి చేరుకుని అల్లర్లు సృష్టించడం పరిపాటిగా మారింది. లంబాడిపేటకు సమీపంలోనే పది ఎకరాల విస్తీర్ణంలోనే టిటి యార్డు ఉంది. రాత్రి సమయాల్లో అక్కడ ఎవరూ కాపలా



లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారికి అది అడ్డాగా మారింది. అర్ధరాత్రి పుట్టినరోజు పండుగల పేరుతో మత్తుపదార్థాలు సేవించడం, స్థానికుల ఇళ్లపైకి రావడం, వారిని భయభ్రాంతులకు గురిచేయడం గతంలో అనేకసార్లు జరిగాయి. బాధితుల ఫిర్యాదు మేరకు నానిని అరెస్టు చేసినట్లు సిఐ శేషగిరిరావు, ఎస్ఐ రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాడేపల్లిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైతే, సిసి కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు.

రేపు డి.ఫార్మసీ ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు, గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కాలేజిలో ఫార్మసీ డిప్లమాలో ప్రవేశానికి కౌన్సెలింగ్ అనంతరం మిగిలిపోయిన సీట్లకు ఈనెల 2న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు.ఇంటర్ బైపిసి, ఎంపిసి విద్యార్థినులు రెగ్యులర్‌గా గానీ, కంపార్ట్‌మెంట్‌లో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవటానికి అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలతో రూ.6300 ఫీజు చెల్లించి, అడ్మిషన్ పొందవచ్చన్నారు. స్పాట్ అడ్మిషన్‌లో సీటు పొందే విద్యార్థినులకు ఎలాంటి ఫీజు రాయితీ, స్కాలర్‌షిప్‌లు ఉండవని తెలిపారు. జనవరి 30వ తేదీ నుండి స్పాట్ అడ్మిషన్లకు అప్లికేషన్లు గుంటూరు, గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కాలేజి, ప్రిన్సిపాల్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నాట్కో కేన్సర్ సెంటర్ పరిశీలన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ సమగ్ర వైద్యశాల నాట్కో క్యాన్సర్ సెంటర్ ను ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సిఇఒ ఎం. ఎన్. హరీంద్ర ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వ రంగంలోని క్యాన్సర్ రోగులకు నాట్కోలో అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని ఆయన అన్నారు. సమగ్ర క్యాన్సర్ సెంటర్ గా చెయ్యడానికి అవసరమైన అవసరాలపై ఆయన అధ్యయనం చేశారు. సెంటర్ నిర్మాణంతో బాటు నిర్వహణ చెయ్యడమే కాకుండా రోగులకు వివిధ రకాల గా సేవలందిస్తున్న నాట్కో ట్రస్ట్ పాత్ర ఎంతో శ్లాఘనీయమని ఆయన చెప్పారు. ఈ సెంటర్ కు అవసరమైన అదనపు సిబ్బంది నియామకం , ఆరోగ్యశ్రీ ఖాతా లో ఈ సెంటర్ కు జమ అవుతున్న నిధులు, ఈ సెంటర్ కే వినియోగించడం, ఇక్కడ విధులు నిర్వర్తించే శిక్షణ పొందిన నర్సింగ్ సిబ్బందిని ఇక్కడే కొనసాగించడం, ఈ సెంటర్ లోని ఐ సి యూ లకు ప్రత్యేక సిబ్బంది నియామకం, క్యాన్సర్ రోగులకు వెంటనే రక్త పరీక్షలు నిర్వహించి నిర్ధారణ చేయాలని ఆయన తెలిపారు. నాట్కో



క్యాన్సర్ సెంటర్‌లో జరుగుతున్న శస్త్ర చికిత్సల వివరాలు అడిగి తెలుసుకొని ఇక్కడ అవసరమయిన పరికరాల కొనుగోలుకు ఆరోగ్యశ్రీ నిధులు కేటాయింపు చేయగలనని హామీ ఇచ్చారు. క్యాన్సర్ నిర్ధారణ లో అధిక రోగులకు అవసరమైన పెట్ సీ టీ పరీక్షకు తాత్కాలికంగా ప్రైవేట్ సంస్థలతో అవగాహన చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అకాడమిక్ డి.ఎం. ఈ డాక్టర్ వర ప్రసాద్, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి , డాక్టర్ దుర్గా ప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్ డాక్టర్ శివరామ కృష్ణ, డాక్టర్ జాహ్నవి , డాక్టర్ అయ్యప్ప , నాట్కో సమన్వయ కర్త అశోక్ కుమార్ పాల్గొన్నారు.



జడ్‌పి చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా, సురేష్‌కుమార్ దంపతుల్ని కలిసిన నూతన సిఇఒ

జెడ్పీ సిఇఒగా మోహనరావు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు : జిల్లా పరిషత్ నూతన సిఇఒగా జె.మోహనరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జెడ్పి ఛైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినాను, తాడికొండ వైసిపి సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటి వరకూ జెడ్పి సిఇఒగా పనిచేసిన డాక్టర్ జి.శ్రీనివాసరావు, మోహనరావుకు బాధ్యతలు అప్పటించారు. శ్రీనివాసరావును మాతృశాఖకు సరెండర్ చేయటం, డిప్యూటీ సిఇఒ సుజాతను ఆ బాధ్యతల నుండి తప్పించిన విషయం విదితమే.



మిర్చి నిల్వలు

		బ్యాగులు
మిర్చి దిగుమతి	:	1,05,472
మిర్చి ఎగుమతి	:	1,10,318
మిర్చి నిల్వ	:	75,278

మిర్చి ధరలు

	రూపాయలలో
334	8,000 -22,000
నెం.5	11,000- 20,000
273	9,000 - 20,500
341	13,000 - 24,000
4884	9,500 - 16,000
సూపర్ 10	19,000 - 19,000
నాన్ ఎసి	
తేజ	7,500 - 20,000
బడిగె	10,000 - 24,000
దేవనూరు డీలక్స్	8,800- 20,500
తాలుకాయలు	4,000 - 12,000

పాదయాత్ర కాదు.. ఊరేగింపు

లోకేశ్‌పై ఎమ్మెల్సీ డొక్కా విమర్శలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేసేది పాదయాత్ర కాదని కేవలం ఊరేగింపులా జరుగుతోందని శాసన మండలి చీఫ్ విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. మంగళవారం గుంటూరు లోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ నారా లోకేష్ పాదయాత్ర పై స్పందించారు. లోకేష్ చేసేది పాదయాత్ర కాదని టిడిపి ఊరేగింపుగా ఉందని ఆయన అభివర్ణించారు. బల నిరూపణ కోసం పాదయాత్ర చేయకూడదని ఆయన సలహా ఇచ్చారు. ప్రజల కష్టాలు తెలుసుకోవడానికి ప్రజల వద్దకు వెళ్ళాలే తప్ప ఊరేగింపు గా వెళ్ళితే ఫలితం శూన్యం అన్నారు. రాష్ట్రంలో జగన్ పరిపాలన ఉండగా ప్రజలకు కష్టాలు రావన్నారు. రాజధాని రైతులకు త్వరలో మంచి జరగబోతుందన్నారు. సీఎం జగన్‌ని కలవడానికి కొంతమంది రైతులు ఉత్సాహం గా ఉన్నారని ఆయన అన్నారు.

రెండు క్వింటాళ్ల మిర్చి చోరీ

ప్రజాశక్తి-ఈపూరు : రైతు పొలంలో ఆరబోసిన మిరపకాయలు చోరీ జరిగిన సంఘటన మండల కేంద్రమైన ఈపూరు గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన గంజనబోయిన చిన్న మిరపకాయలు కోత అనంతరం ఆరబెట్టేందుకు పొలం సమీపంలోని ఖాళీ ప్రదేశంలో ఆరబోశాడు. రోజు మాదిరిగానే ఉదయాన్నే మిరపకాయల కల్లం వద్దకు వెళ్లి చూడగా సుమారు రెండు క్వింటాల్ల మిరప కాయలు చోరీకి గురైనట్లు గుర్తిం చాడు. చోరీ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

మాచర్లలో చెడ్డి గ్యాంగ్ సంచారం!

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - మాచర్ల : మాచర్ల పట్టణంలో కిడ్స్ పాఠశాల సమీపం యందలి ఆపార్ట్‌మెంట్‌లో చెడ్డి గ్యాంగ్ దొంగతనానికి పాల్పడినట్లు తెలిసింది. సదరు ఆపార్ట్‌మెంట్‌లో తాళం వేసిన ఇంటి తాళాలు పగలగోట్టేందుకు చెడ్డి గ్యాంగ్ చేసిన ప్రయత్నం విఫలం అయినట్లు తెలిసింది. ఈ మేరకు ఆపార్ట్‌మెంట్ సిసి కెమెరాలో నల్గురు వ్యక్తులు ముఖాలకు మంకి క్యాప్‌లు పెట్టుకుని రాడ్లు పట్టుకుని దొంగతానానికి ప్రయత్నం చేసిన దృశ్యాలు రికార్డు కావటాన్ని అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే వారు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల కాలంలో ఓల్డ్ టౌన్‌లో తాళం వేసిన ఒక ఇంటిలో చోరికి పాల్పడినట్లు మరో ఘటన వెలుగులోకి వచ్చింది. ఇంటికి తాళం వేసిన వాటిని గుర్తించి చెడ్డి గ్యాంగ్ టార్గెట్‌గా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పలువురు వాపోతున్నారు. ప్రజలు అప్రమత్తతతో ఉండాలని అర్బన్ సిఐ కోరుతున్నారు. రాత్రి వేళలలో గస్తీని ముమ్మరం చేస్తున్నట్లు తెలిపారు.



పల్నాడును నిరాశపరచిన సిఎం పర్యటన : సిపిఎం

ప్రజాశక్తి - వినుకొండ

పల్నాడు ప్రాంత ప్రజల సాగు, తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించే వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణం అంశాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రస్తావించకపోవడం బాధాకరమని సిపిఎం జిల్లా నాయకులు కె.హనుమంతరెడ్డి అన్నారు. నాలుగేళ్ల తర్వాత వినకొండకు వచ్చిన సిఎం గత హామీలు నెరవేర్చుకునే విధంగా మాట్లాడ తారని ప్రజలు భావించినా నిరాశే మిగిల్చా రని అన్నారు. ఈ మేరకు స్థానిక సిపిఎం కార్యాలయంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు మదార్‌వలితో కలిసి మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉండగా వరికపూడిసెల నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే, ఎంపీతో పాటు సీఎం హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దీనిపై ఇప్పటికైనా అసెంబ్లీ సమావేశంలో స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అటవీ, వన్య సంరక్షణ అనుమతుల కోసం వైసిపి, టిడిపి ఎంపీలు పార్లమెంట్లో ప్రస్తావించి అనుమతులు తేవాలని కోరారు. సిఎం వస్తున్నారనే కారణంతో వినుకొండలో మూడ్రోజులపాటు చిరు వ్యాపారులను మూసి వేయించడం ఏమిటని ప్రశ్నించారు. సిఎం దృష్టికి ప్రజా సమస్యలను తీసుకెళ్లకుండా ప్రజాసంఘాలను అడ్డుకున్నారని, సిపిఐ, సిపిఎం, సిఐటియు, ఎఐటియుసి, టిఎన్‌ఎస్‌ఎఫ్ ప్రజాసంఘాల నాయకులకు నోటీసులి చ్చారని, కేసులు పెడతామని బెదిరించా రని మండిపడ్డారు. జీవో 1 ప్రకారం బహిరంగ సభలు పెట్టడానికి వీల్లేదని చెప్పిన అధికారులు వైసిపి సభలకు చట్టం వర్తించదా? అని ప్రశ్నించారు. ఫ్లెక్సీలు వేయరాదని నోటీసులిచ్చిన మున్సిపల్ కమిషనర్‌కు వైసిపి ఫ్లెక్సీలు కనపడలేదా అని ప్రశ్నించారు. వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణంలో భారీ చెట్లను నరికించడాన్ని తాము ఖండిస్తున్నట్లు చెప్పారు.

కుంగ్‌ఫు-కరాటేలో గణపవరం విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి - నాదెండ్ల

మండలం గణపవరంలోని శ్రీ కెల్లంపల్లి భద్రాచలం ఉన్నత పాఠశాల ఆవరణలో కుంగ్‌ఫు శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఇటీవల పోటీల్లో ప్రతిభ చూపారు. కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌లో ఎ.అంజిబాబు ఆధ్వర్యంలో గతనెల 29న నిర్వహించిన ఆంధ్ర ప్రదేశ్ ఓపెన్ కుంగ్ ఫు - కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించారు. శిక్షణ పొందుతున్న వారిలో 8 మంది ఈ పోటీల్లో పాల్గొనగా ముగ్గురు బంగారు పతకాలు, ఐదుగురు వెండి పతకాలు సాధించారు. బంగారు పతకాలను ఎస్.చైతన్యరెడ్డి, కె.భవాని, ఎ.అమూల్య సాధించారు. వీరితోపాటు శిక్షణిచ్చిన సుభాని మాస్టర్‌ను చిలకలూరిపేట గ్రాండ్ మాస్టర్ ఎస్ఎం కమల్‌బాష మాస్టర్, తల్లిదండ్రులు అభినందించారు.



గురుకులంలో పరిస్థితి ఏమీ బాగోలేదు..!

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఆహారం వికటించి అస్వస్థత పాలైన విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల కోరారు. రామకృష్ణాపురం గురుకుల పాఠశాలలో విద్యార్థులు సత్తెనపల్లిలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతుండగా వారిని సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు మంగళవారం పరామర్శించారు. వారితో మాట్లాడి వారి ఆరోగ్య వివరాలను తెలుసుకోవడంతోపాటు సమస్యకు దారి తీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆదివారం వండిన చికెనులో కొంత మిగలగా దాన్ని సోమవారం ఉదయం ఏర్పాటు చేసిన కిచిడితో కలిసి వడ్డించడంతో దాన్ని తిన్న తమకు ఈ పరిస్థితి తలెత్తినట్లు విద్యార్థులు చెప్పారని నాయకులు అన్నారు. పాఠశాలలో పారిశుధ్యం అధ్వానంగా ఉంటుందని, పాఠశాల ఆవరణలోని చెరువులో నీరు శుద్ధి చేయకుండానే తాగాల్సి వస్తోందని, బాత్‌రూంలు సరిగా లేవని, బాత్రూంలోకి



బాధిత విద్యార్థినులతో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

నీరును బయట నుండి తెచ్చుకోవాల్సి వస్తున్నట్లు విద్యార్థులు వాపోయారని నాయకులు తెలిపారు. ఈ సమస్యలన్నింటినీ ప్రభుత్వం, అధికారులు పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. నిర్వహణపైనా ఉన్నతాధికారులు నిత్యం పర్యవేక్షించా లన్నారు. పరామర్శించిన వారిలో నాయకులు ఎ.వీరబ్రహ్మం, గద్దె ఉమశ్రీ, ఆర్.పురుషోత్తం, జె.రాజకుమార్, జి.సుసులోవ్, కె.సాయికుమార్, అమూల్య, సిద్ధు, ఎ.రామయ్య, జి.రజని, ఎం.జ్యోతి, టి.లక్ష్మి, ఎం.హరిపోతురాజు, పి.సూర్యప్రకాష్‌రావు పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ నాయకుల పరిశీలన

రెండ్రోజుల కిందట తీసుకున్న ఆహారం కలుషితం కావడం వల్లే అది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ఎంఆర్‌పిఎస్ పల్నాడు జిల్లా అధ్యక్షులు చింతిరాల మీరయ్య మాదిగ అన్నారు. సత్తెనపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న

పరామర్శించిన ప్రజా సంఘాల నాయకుల ఎదుట విద్యార్థినుల ఆవేదన

బాధిత విద్యార్థినులను ఎంఆర్‌పిఎస్ నాయకులు ఎ.మోహన్‌మాదిగ, ఇతర నాయకులతో కలిసి ఆయన మంగళవారం పరామర్శించారు. హాస్టల్లో జరిగిన ఘటనపై అక్కడి సిబ్బంది, విద్యార్థినులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటనపై విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరతామని చెప్పారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

విద్యార్థినులు అస్వస్థతకు గురవడంలో వార్డెన్ నిర్లక్ష్యమే కారణమని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చూడాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంతో ఆస్పత్రి నుండి బయటకు వచ్చేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలని, మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

పాత పెన్షన్ కోసం 3న సంకల్పదీక్ష





గుంటూరులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, నాయకులు.. పిడుగురాళ్లలో మాట్లాడుతున్న జి.విజయసారధి

ప్రజాశక్తి-గుంటూరు, నరసరావుపేట

సిపిఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ అమలు జరపాలని ఫిబ్రవరి 3న కృష్ణాజిల్లా ధర్మస్థలి క్షేత్రంలో యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగే సంకల్పదీక్ష నిర్వహిస్తున్నట్లు గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్, పల్నాడు జిల్లా సహాధ్యక్షులు ఎన్. సుందరరావు తెలిపారు. మంగళవారం సంకల్ప దీక్ష జయప్రదం చేయాలని కోరతూ గుంటూరు బ్రాడీపేట యుటిఎఫ్ కార్యాలయంలో, పల్నాడు జిల్లా నరసరావుపేట స్టేషన్‌రోడ్డులో గల యుటిఎఫ్ కార్యాలయంలో వేర్వేరుగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశాల్లో ాంకల్పదీక్షను విజయవంతం చేయాలని పోస్టర్ ఆవిష్కరించి, నాయకులు ప్రసంగించారు. గుంటూరులో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర సహాధ్యక్షురాలు ఎ.ఎన్.కుసుమకుమారి మాట్లాడుతూ నాలుగు ఏళ్లగడిచిన ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపోయిందని, ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. అందుకే సంకల్పదీక్ష ద్వారా ఉద్యోగుల ఆవేదనను తెలియజేయటం కోసం ఏర్పాటు చేసిన సంకల్ప దీక్షలో ప్రతి ఉపాధ్యాయుడు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, సిపిఎస్ కన్వీనర్ సిహెచ్.ఆదినారాయణ, జిల్లా కార్యదర్శులు జి.వెంకటేశ్వరరావు, ఎం.గోవిందయ్య, ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.గురుబ్రహ్మం, గుంటూరు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చిన్నయ్య, ప్రభుజీ, సోషల్ మీడియా కన్వీనర్ కె.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

నరసరావుపేటలో పల్నాడు జిల్లా సహాధ్యక్షులు ఎన్. సుందరరావు మాట్లాడుతు ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతిపక్ష నేత హోదాలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధస్తామని ఉద్యోగ ఉపాధ్యాయులకు హామీ ఇచ్చి 4 ఏళ్ళు గడిచినప్పటికీ ఇచ్చిన హామీ నిలబెట్టుకోకుండా మోసం చేసి ఉద్యోగ ఉపాధ్యాయుల ఆగ్రహావేశాలు మూటగట్టుకున్నారన్నారు. సిపిఎస్ రద్దుకై యుటిఎఫ్ స్వతంత్రంగా మరియు ఉమ్మడి వేదికగా ఇతర ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో కలిసి అనేక రూపాల్లో పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్ పునరుద్ధరించడం తప్ప జిపిఎస్ కానీ మరే ఇతర విధానాన్ని అమలు జరిపినా సహించేది లేదని హెచ్చరించారు. సంకల్ప దీక్ష సభలో ఇతర శాఖలలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ సహాధ్యక్షురాలు ఏ. బాగేశ్వరిదేవి, యుటిఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎం. మోహన్ రావు, జిల్లా ఆడిటర్ ఎస్.ఎం.ఎ. గఫార్, యుటిఎఫ్ సీనియర్ నాయకులు వై.శ్రీనివాసరావు, నరసరావుపేట పురపాలక సంఘ పరిధి యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, మండల బాధ్యులు ఎం.పి.వి సుబ్రహ్మణ్యాచారి, టి.నాగరాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పిడుగురాళ్ల

పాత పెన్షన్ విధానం సాధన కోసం ఈనెల 3వ తేదీన యుటిఎఫ్ విజయవాడలో నిర్వహించే సంకల్ప దీక్షను జయప్రదం చేయాలని యుటిఎఫ్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయసారధి కోరారు. దీక్షకు పిడుగురాళ్ల ప్రాంతీయ శాఖల నుండి ఉద్యోగులు, ఉపాధ్యాయులు అందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు పోస్టర్‌ను పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఎంవి.సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసరావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ షేక్ జమాల్, సీనియర్ నాయకులు జి.రోశయ్య, జి.ప్రసాదరావు, పి.శివశంకర్, ఫిరోజ్ బాషా, చంద్రశేఖర్, ఆర్.సత్యనారాయణ, సాయిబాబా, సాంబశివరావు పాల్గొన్నారు.

జయప్రదానికి యుటిఎఫ్ పిలుపు - దీక్ష పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - మాచర్ల

యుటిఎఫ్ శుక్రవారం విజయవాడలో నిర్వహించే దీక్షలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి ఎ.నాసర్‌రెడ్డి, ఆయేషాసుల్తానా కోరారు. ఈ మేరకు దీక్షల పోస్టర్‌ను స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. తాము అధికారంలోకి రాగానే సిపిఎస్‌ను రద్దు చేస్తామని ప్రతిపక్ష నేతగా హామీనిచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు ఆ హామీని పూర్తిగా విస్మరించి మోసం చేశారని అన్నారు. ఈ నేపథ్యంలో గతం నుండి చేస్తున్న ఆందోళనలకు కొనసాగింపుగా దీక్షలు చేపట్టినట్లు చెప్పారు.

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.రవిబాబు మాట్లాడారు. నాయకులు ఆర్.అజయ్ కుమార్, భీమ్లా నాయక్, రమేష్‌బాబు, జి.సాంబశివరావు, సిహెచ్. మల్లికార్జున రావు, సిహెచ్. గోపిరాజు, డి.రవికుమార్, రాంబాబు, జి.రామారావు పాల్గొన్నారు.





నరసరావుపేట, వినుకొండలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు


చైర్‌పర్సన్‌కు డిసెంట్ ఇస్తున్న టిడిపి కౌన్సిలర్లు


కౌన్సిల్‌లో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

కౌన్సిల్ సమావేశంలో అధికారపక్షం ప్రశ్నల వర్షం

ఏకపక్షంగా అజెండా ఆమోదంపై డిసెంట్ ఇచ్చిన టిడిపి

ప్రజాశక్తి-తెనాలి

కౌన్సిల్ సమావేశమంటే సాధారణంగా ప్రతిపక్షం ఏం మాట్లాడుతుందోనన్న ఉత్కంఠ ఉంటుంది. అయితే దాదాపు నాలుగు సమావేశాల నుంచి అధికారపక్ష కౌన్సిలర్లే పాలక పక్షాన్ని నిలదీస్తున్నారు. కౌన్సిల్ తీరుపై సర్వత్రా విమర్శలు వినవస్తున్నా ఎలాంటి మార్పు లేదు. కౌన్సిల్ హాల్లో మంగళవారం చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నశీం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇదే పరిస్థితి పునరావృతమసైంది. అజెండా చదువుతుండగానే వైసిపి కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య అధికారులను నిలదీశారు. పైప్‌లైన్ మరమ్మతుల కోసం తవ్విన రోడ్లను ఎప్పటికి పూడుస్తారని, వార్డుల్లో పనులు చేయకపోగా కనీసం మరమ్మతులు కూడా చేయరా అని ప్రశ్నించారు. దీనిపై చైర్‌పర్సన్ జోక్యం చేసుకుని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదే సమయంలో 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు మాట్లాడుతూ 11, 15 వార్డులకు సంబంధించి ఒకే సచివాలయం ఉందని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలు పరిష్కరించేందుకు సచివాలయానికి రూ.20లక్షలు మంజూరు చేశారని, అయితే తన వార్డులో కార్యక్రమం జరగకుండానే సచివాలయానికి మంజూరైన రూ.20లక్షలతో 11వ వార్డులోనే పనులు ఎలా ప్రారంభిస్తారని అధికారులను ప్రశ్నించారు. రెండు వార్డులకు కలిపి ఒకే సచివాలయం ఉన్నపుడు ఆ నిధులను రెండు వార్డులకు సమంగా ఉపయోగించాలి కదా అని ధ్వజమెత్తారు. సమాదాన మిచ్చేందుకు అధికారులు, చైర్‌పర్సన్ తడుముకోవాల్సి వచ్చింది. చివరకు కమిషనర్ జోక్యం చేసుకుని మున్సిపల్ సాధారణ నిధులతో 15వ వార్డులో సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ఇలా కౌన్సిల్‌లో అధికార పక్షమే పాలకవర్గాన్ని ఇబ్బంది పెట్టడం పరిపాటిగా మారింది. ఇదిలా ఉండగా టిడిపికి చెందిన నాల్గో వార్డు కౌన్సిలర్ అడుసుమల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కాంట్రాక్టర్లు పనులు దక్కించుకోవటమేకాని, వాటిని పూర్తి చేయటంలేదన్నారు. ఫలితంగా 14వ ఆర్థిక సంఘం నిధులు వెనక్కుమళ్లే పరిస్థితి నెలకొందన్నారు. దీనిపై కమిషనర్, ఎంఈ నాగమల్లేశ్వరరావు జోక్యం చేసుకుని నిధుల చెల్లింపులో జాప్యం కారణంగా కాట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రావటంలేదని, పరిస్థితిని చక్కదిద్దుతామన్నారు. టిడిపి ఫ్లోర్ లీడర్ పసుపులేటి త్రీమూర్తి మాట్లాడుతూ అజెండాలో పొందుపరచిన 42 టెండర్లలో 36 టెండర్లు కు సింగిల్ టెండర్ దాఖలు కావటమేమిటని, అంతా లోపభూయిష్టంగా ఉందని వాటిని రద్దు చేసి, మరలా టెండర్లు పిలవాలన్నారు. ఈలోగా అధికార పక్షం కౌన్సిలర్లు జోక్యం చేసుకుని అజెండా ఆమోదించినట్లు ప్రకటించటంతో సమావేశం ముగిసినట్లు చైర్‌పర్సన్ ప్రకటించారు. కౌన్సిల్ ఏక పక్ష వైఖరిని నిరసిస్తూ టిడిపి కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌కు డిసెంట్ ఇచ్చారు. సమావేశంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, ఎంఈ కె.నాగమల్లేవ్వరరావు, ప్రణాళికా విభాగం, రెవిన్యూ, టౌన్‌ప్లానింగ్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.


ఎంపికైన లిఫ్టర్లతో మల్లేశ్వరరావు, సందాని

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు
మంగళగిరి నుండి ఐదుగురు ఎంపిక

ప్రజాశక్తి - మంగళగిరి

ఫిబ్రవరి 2,3 తేదీల్లో కష్ణాజిల్లా జగ్గయ్యపేట పట్టణంలో రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ స్కూల్ గేమ్స్ జరుగుతున్నాయి. ఈ పోటీలకు మంగళగిరి కి చెందిన ఐదుగురు లిఫ్టర్స్ ఎంపికైనట్లుగా జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి జి పుల్లేశ్వరరావు మంగళవారం తెలిపారు. అండర్ 17 విభాగంలో 59 కేజీల విభాగంలో జి హేమవర్ధన్, 83 కేజీలే భాగంలో జి గణేష్, 93 కేజీలు భాగంలో షేక్ ఇర్ఫాన్, అండర్ 19లో 66 కేజీలు భాగంలో జి శివ వీరయ్య, మహిళల విభాగంలో షేక్ సబీనా 84 కేజీల భాగంలో ఎంపికైనట్లుగా తెలిపారు. వీరంతా మంగళగిరి పిట్ జోన్ కోచ్ షేక్ సంధాని వద్ద శిక్షణ పొందారు. ఎంపికైన లిఫ్టర్లను అభినందించినట్లుగా పుల్లేశ్వరరావు తెలిపారు.



మాజీ మంత్రికి సన్మానం

ప్రజాశక్తి-తాడేపల్లి

మాజీ మంత్రి, టిడిపి రాష్ట్ర బిసిసెల్ అధ్యక్షుడు కొల్లు రవీంద్రను మంగళవారం టిడిపి రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి డి.సుందరావు యాదవ్ శాలువా కప్పి సన్మానించారు. యువగళం పాదయాత్రకు బిసిలందరూ మద్దతు ఇవ్వాలని రవీంద్ర కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షులు రేఖా సుధాకర్ గౌడ్, వి. మాధవరావు, కె.సాయిచంద్ తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేను నిరంతరం పర్యవేక్షించాలి

జిల్లా సంయుక్త కలెక్టర్ రాజకుమారి

ప్రజాశక్తి-గుంటూరు



జిల్లాలో భూముల రీసర్వే ప్రక్రియ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం సక్రమంగా జరిగేలా రెవెన్యూ డివిజన్, మండల రెవెన్యూ అధికారులు నిరంతరం పర్యవేక్షించి, క్షేత్రస్థాయి సిబ్బందికి అవసరమైన సూచనలు అందించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. మంగళవారం కలక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జెసి రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణశర్మ, డిఆర్ఒ కె.చంద్రశేఖర్‌రావుతో కలసి రెవెన్యూ అంశాలపై సబ్ కలెక్టర్, ఆర్డిఓ, తహశీల్దార్లు, సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ భూముల రీసర్వేకి సంబంధించి ఓఆర్ఐ మ్యాప్‌లు అందినప్పటి నుండి గ్రౌండ్ ట్రూతింగ్, వ్యాలిడేషన్, సెక్షన్ 13 నోటీసులు తదితర ప్రక్రియలు, రికార్డ్స్ నిర్దేశిత సమయంలో సక్రమంగా పూర్తి చేసి భూ హక్కు పత్రాలను సిద్ధం చేయాలన్నారు. శ్మశాన వాటికలకు కేటాయించిన స్థలాల రికార్డులను గ్రామ పంచాయతీలకు హ్యాండ్ ఓవర్ చేసి రెవెన్యూ రికార్డులలో అప్ డేట్ చేయాలన్నారు. రీ సర్వే ప్రారంభించనున్న గ్రామాల్లో క్షేత్ర స్థాయి భూ రికార్డుల స్వచ్ఛీకరణ, సాదాబైనామాల దరఖాస్తులు సక్రమంగా పరిష్కరించాలని, గుర్తించిన మ్యుటేషన్లను సుమోటోగా సరిదిద్దాలన్నారు. రబీ ఈ-క్రాప్ బుకింగ్‌కు సంబంధించి రెవెన్యూ అధికారులు ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ భవనాలకు స్థలాల కేటాయింపు, ఎంఐజీ లే అవుట్స్, డాటెడ్ ల్యాండ్, 22ఏ కేసులు, ఈ-ఆఫీస్, తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించి అధికారులకు సూచనలు జారీ చేశారు.

వివిఐటిలో పాప్‌కార్న్ చిత్రం యూనిట్ సందడి

ప్రజాశక్తి-తెనాలి


విద్యార్థులతో పాప్‌కార్న్ చిత్రం యూనిట్

ఫిబ్రవరి 10న విడుదల కానున్న పాప్‌కార్న్ చిత్రం యూనిట్ బృందం మంగళవారం నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాల్లో సందడి చేశారు. అవికా స్క్రీన్ క్రియేషన్స్, ఆచార్య క్రియేషన్స్ బ్యానర్‌పై గంధం మురళీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రంలో చిన్నారి పెళ్ళికూతరు ఫేమ్ అవికాగోర్ హీరోయిన్‌గా, సాయిరోనక్ హీరోగా నటించారు. చిత్రం విడుదలను పురస్కరించుకుని కళాశాలకు వచ్చిన బృందంతో విద్యార్థులు సెల్ఫీలు దిగారు. నృత్యాలు చేశారు. ఈసందర్భంగా డైరెక్టర్ మురళి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణను చిత్రం చూరగొంటుందన్నారు. హీరో మాట్లాడుతూ విభిన్న కథనంతో తెరకెక్కిన చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలన్నారు. చిత్రం ట్రైలర్‌ను హీరో నాగార్జున విడుదల చేసిన నేపథ్యంలో మంచి ప్రాచుర్యం పొందిందన్నారు. వివిఐటి చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లిఖార్జునరెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



ముగ్గురోడ్డులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-తాడేపల్లి :తాడేపల్లి పట్టణంలోని ముగ్గురోడ్డులో మంగళవారం విన్ విజన్ కంటి ఆసుపత్రి, విజిఆర్ డయాబెటిక్ స్పెషాలిటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వంద మంది డయాబెటిస్ పరీక్షలు, తొంబై మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరందరికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మరికొందరిని ఆసుపత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో విన్ విజన్ కంటి ఆసుపత్రి వైద్యులు ఉప్పలపాటి నిషాంత్ జనార్ధనరాజు, పాస్టర్ కెకె రవికుమార్, మార్కెటింగ్ పర్సన్ బాషి, సిబ్బంది జ్ఞానేశ్వరి, శివ, విజిఆర్ స్పెషాలిటీస్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ శివప్రసాద్, సిబ్బంది తరుణ్, కృష్ణ చైతన్య, యశ్వంత్, భాస్కర్, రంగారెడ్డి, జడ్సా, బెంజిమన్, అనిల్ పాల్గొన్నారు.

ప్రొఫెసర్ విద్యాసాగర్‌కు ఐఎపిసి ప్రశంసా పత్రం


ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యాసాగర్

ప్రజాశక్తి-తెనాలి రూరల్ : స్థానిక మారీసుపేట రెండు గేట్ల మధ్య నున్న దయామణి జోసఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మంగళవారం పాఠశాల ఫౌండర్ దయామణి వర్ధంతి సభ నిర్వహించారు. అత్తోట రత్నశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత దయామణి చిత్రపటానికి నివాళులర్పించారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఇంటర్నేషనల్ అంబాసిడర్స్ పీస్ కార్పొరేషన్(ఐఎపిసి) చైర్మన్ బిషప్ ప్రవర్ధన వర్మ మాట్లాడుతూ దయామణి ఉత్తమ ఉపాధ్యాయపురస్కార గ్రహీతని, ఆమె ఆశయాలను కొనసాగిం చటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా దయామణి తనయుడు, ప్రవాసభారతీయుడు ప్రొఫెసర్ అత్తోట విద్యాసాగర్‌కు ఇంటర్నేషనల్ అంబాసిడర్స్ పీస్ కార్పొరేషన్ ప్రశంసాపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ అత్తోట హేమలత, లావణ్య, మణికంఠ, పాస్టర్ విజయకుమార్, మేకల సురేష్, ఆలపాటి సుదీర్, పినపాటి సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఎపిఎస్‌డబ్ల్యూసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-తెనాలి



ఆంధ్రప్రదేశ్ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పోరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా తెనాలి ఏపిఎస్‌డబ్ల్యూసి మేనేజర్ ఎం.శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక కార్యాలయంలో ఆయన మంగళవారం వివరాలను వెల్లడించారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన యూనియన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారని, తనతోపాటు అధ్యక్షులుగా విజయనగరం రీజినల్ మేనేజర్ ఎస్ రవికుమార్‌ను, ఉపాధ్యక్షులుగా వేర్‌హౌస్ మేనేజర్ భానుమూర్తి, జాయింట్ సెక్రటరీగా కె.రవిరాజ్, వేర్‌హౌస్ మేనేజర్, ట్రెజరర్‌గా కె.రామకృష్ణారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ స్టాఫ్, అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ సిబ్బందికి వేతనాలు తక్కువగా ఉన్నాయని, యూనియన్ తరపున వారి వేతనాల పెంపునకు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది సర్వీసుల క్రమబద్దీకరణకు కృషి చేస్తామన్నారు. ఇప్పటి వరకూ యూనియన్ పరంగా రిటైర్డ్ ఎంప్లాయీస్‌కు మెడికల్ రీ ఇంబర్స్‌మెంట్ పథకం వర్తింపునకు, రూ.10లక్షలు రెగ్యులర్ ఎంప్లాయీస్ హెల్త్ ఇన్సూరెన్స్‌కు, పించన్ పథకం అమలుతోపాటు పలు అభివృద్ధి పనులకు కృషిచేసిందన్నారు. భవిష్యత్ కార్యాచరణలోనూ ఉద్యోగుల సంక్షేమం కోసం సమిష్టిగా పనిచేస్తామని శ్రీనివాసరావు వెల్లడించారు. ఈసందర్భంగా శ్రీనివాసరావును నూతన కార్యవర్గ బృందం, పలువురు కార్యాలయ సిబ్బంది అభినందించారు.

సూక్ష్మ, బిందు సేద్యంపై అవగాహన కల్పించాలి

- జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం
- వ్యవసాయ శాఖాధికారులకు జాయింట్ కలెక్టర్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఎ. శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

సూక్ష్మ, బిందు సేద్యంపై జిల్లా లోని రైతుల్లో అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖాధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ ఆదేశించారు. నరసరావుపేట లోని కలెక్టరేట్‌లోని స్పందన మీటింగ్ హాల్‌లో మంగళవారం జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా వ్యవ సాయ మండల అధ్యక్షులు కుర్రి సాయి మార్కండోరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జెసి శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ బిందు సేద్యంపై నీటి ఆదాయం, ఉపయోగాలు పంట దిగు బడులపై రైతులకు సమగ్ర అవ గాహన కల్పించాలని అన్నారు. అలాగే, బిందు సేద్యంతో పండిస్తున్న పంటలకు ఆశించే చీడపీడ నివా రణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని చెప్పారు. జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి మాట్లాడుతూ చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. చిరు ధాన్యాలు పండించే విస్తీర్ణాన్ని పెంచి రైతులు పండించిన పం టకు గిట్టుబాటు ధరను పొందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు సమీకృత వ్యవసాయ ఉత్పా దకాల పరీక్షా కేంద్రాల ద్వారా నమూనాలను పరీక్షించుకోవాలని కోరారు. సలహా మండలి చైర్మన్ మాట్లాడుతూ వ్యవసాయ పరికరాలు, సూక్ష్మ పోష కాలు రైతులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. రైతులు వారి కమతాలలో నీటి గుంటలు ఏర్పాటు చేసుకొని సూక్ష్మ బిందు సేద్యం ద్వారా నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో పంటలను కాపాడు కోవాలని సూచించారు. ఈ-క్రాప్, ఈ-కేవైసీ వంద శాతం చేయాలని చెప్పారు. నర్సరీలు, పురుగు మందుల షాపులను నిరంతరం తనిఖీ చేయాలని సూచించారు. వ్యవసాయ సలహా మండలి సభ్యులు కె.విజయ భాస్కర్‌రెడ్డి, ఎన్. సాంబశివరావు పాల్గొన్నారు.



మన్నేపల్లి ఆలయ అభివృద్ధికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి - వినుకొండ

ఎకో టూరిజం అభివృద్ధి పనుల్లో భాగంగా బొల్లాపల్లి మండలం మన్నేపల్లి నరసింహస్వామి ఆలయం అభివృద్ధికి తగు ప్రతిపాదనలు పంపినట్లు పల్నాడు జిల్లా అటవీ శాఖ అధికారి ఎన్. రామచంద్ర రావు తెలిపారు. మంగళవారం ఈ ఆలయాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ 2023 సంవత్సరంలో ఎకో టూరిజం చేపడుతున్న పనుల్లో దీనిని అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ఆలయం చుట్టూ చేపట్టబోయే అబివృద్ధి పనులపై సిబ్బంది, దాతలతో ఆయన చర్చించారు. ఆలయం వద్ద తాగునీటి సౌకర్యం, విశ్రాంతి గదులు మరుగుదొడ్లు, వనాలు, వాహన పార్కింగ్ మొదలైనవి ఏర్పాటు చేసేందుకు ప్రాధాన్యత కల్పించినట్లు వివ రించారు. ప్రభుత్వ ఉత్తర్వులు అందిన వెంటనే వినుకొండ రేంజ్ సెక్షన్ సిబ్బందికి పనులు చేపట్టేందుకు ఆదేశించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఉన్న అటవీ ప్రాంతానికి ఎటువంటి హాని జరగకుండా పనులు జర గాలని సూచించారు. కార్యక్రమంలో రేంజ్ అధికారి సయ్యద్ హుస్సేన్, సెక్షన్ ఆఫీసర్ ఎన్‌వి రమణ, బీట్ ఆఫీసర్ సాంబశివరావు, గణేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



జంతు సంక్షేమ పక్షోత్సవాలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణ పరిధి పసుమర్రులోని శ్రీ మద్ది కామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జంతు సంక్షేమ పక్షోత్సవాలలో భాగంగా వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పశువైద్యశాఖాధికారి డాక్టరు పి.దీప్తి మాట్లాడుతూ జంతువులతో ఎలా ప్రేమగా వ్యవహరించాలో తెలియజేశారు. ప్రమాదంలో ఉన్న జంతువులకు మనం ఎటువంటి అత్యవసర చికిత్స అందించాలో, ఏ విధంగా అందించాలో విద్యార్థులకు వివరించారు. అలాగే, జంతువుల ద్వారా వచ్చే వ్యాధుల గురించి, వాటి నుంచి మనం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించీ వివరించారు కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది కోటేశ్వరమ్మ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మొహమ్మద్ యాసిన్, సైన్స్ ఉపాధ్యాయిని డి.పద్మావతి పాల్గొన్నారు.

'కుష్టు'పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - నాదెండ్ల

కుష్టు వ్యాధి పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గణపవరం పిహెచ్‌సి వైద్యులు ప్రసాద్ నాయక్ తెలిపారు మండలంలోని గణపవరం ఐసిఎం నూలు పరిశ్రమలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. చర్మంపై స్పర్శ లేని మచ్చలు, చర్మం ఉబెత్తుగా బత్తాయి తొక్కలాగా ఉబెత్తుగా ఉండటం, చెవులపై వీపుపై ఎద పై నొప్పి లేని మచ్చలు, కనురెప్పలు మూతపడకపోవడం, కాళూ చేతులు తిమ్మిర్లు లేక జోమూలు కలిగి ఉండుట, అరచేతిలో అరికాళ్ళలో స్పర్శ లేకపోవడం, చిటికెన వేలు, బొటనవేలు సన్నబడటం, చల్లని లేక వేడి వస్తువులను గుర్తించలేకపోవటం మొదలైన లక్షణాలు ఉన్న వారికి సమీప వైద్యశాలలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

యుటిఎఫ్ దుర్గి మండల నూతన కార్యవర్గం ఏకగ్రీవం



రాంబాబు



యోగయ్య

ప్రజాశక్తి - దుర్గి

స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (బిసి)లో యుటిఎఫ్ దుర్గి మండల నూతన కౌన్సిల్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సంద ర్భంగా 2023-24 యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. ఎన్నికల పరి శీలకులుగా పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి విజయసారది, ముఖ్యఅతిథి జె.వాల్య నాయక్, ఎస్‌కె.జమాల్ హాజరై ఈ నూతన కౌన్సిల్‌ను ఏర్పాటు చేశారు. దుర్గి మండల అధ్యక్షునిగా ఎ.యోగయ్య, గౌరవాధ్యక్షుడిగా ఎన్.రాధాకృష్ణమూర్తి, సహాధ్య క్షుడిగా ఆర్.అమరలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఈడే రాంబాబు, కోశాధికారిగా ఎం.కోటేశ్వరరావు నాయక్, మహిళా కార్యదర్శిగా సిహెచ్. సాగరమ్మ, సహాధ్యక్షురాలుగా కె.లీలావతిని, జిల్లా కౌన్సిలర్స్‌ను, మండల కార్యదర్శులను కూడా ఏక`గ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా యుటిఎఫ్ నూతన కార్యవర్గానికి రాష్ట్ర కౌన్సిలర్ ఎ.శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. నూతన కార్యవర్గం రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని, ఉపాధ్యాయ సమస్యలపై త్వరగా స్పందించి వాటిని పరిష్కరించే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పిఆర్‌సి ఎరియర్స్, డి.ఎ ఎరియర్స్‌ను, సిపిఎస్ రద్దు, జడ్పిపిఎఫ్ లోన్స్, ఈఎల్ లోన్స్, మెడికల్ రీఎంబర్స్‌మెంట్ అమౌంట్ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



కమిషనర్‌ను సత్కరిస్తున్న చైర్మన్, కౌన్సిలర్లు

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు : చైర్మన్

ప్రజాశక్తి - మాచర్ల

రానున్న వేసవిలో నీటి ఎద్దడికి వీల్లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి చెప్పారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం స్థానిక కౌన్సిల్ హాలులో మంగళవారం నిర్వహించారు. సమావేశానికి చైర్మన్ అధ్యక్షత వహించగా సమావేశంలో ప్రవేశపెట్టిన ఎజెండాను కౌన్సిల్ ఆమోదించింది. అనంతరం ఉత్తమ ఆవార్డులు అందుకున్న కమిషనర్ ఇవి రమణబాబును సత్కరించారు. వైస్ చైర్మన్ పోలూరి నరసింహరావు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

అమర వెంకటేశ్వరరావుకు నివాళి

ప్రజాశక్తి-నరసరావుపేట

అమర ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ కళాశాల చైర్మన్ అమర వెంకటేశ్వరరావు ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్థానిక ప్రకాష్ నగర్ లోని అమర వెంకటేశ్వరరావు నివాసంలో వెంకటేశ్వరరావు మృత దేహానికి మంగళవారం పూలమాలవేసి నివాళులర్పించారు. కళాశాల స్థాపించి ఎందరో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన అమర వెంకటేశ్వరరావు ఆర్థిక ఇబ్బందులు నేప థ్యంలో ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అమర ఆత్మహత్య పై విమర్శలు సిగ్గుచేటు

అనంతరం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి సానుభూతి పరుడు సౌమ్యుడు అమర వెంకటేశ్వరరావు ఆత్మహత్య పై నరసరావుపేట నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి విమర్శలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. అమరా కళాశాలను బ్యాంకు ఆక్షన్ లో తిరుమల ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ టిడిపి నేత రావెల సత్యనారాయణ కీలకంగా వ్యవహరిం చారని మొదటి బిడ్ తిరుమల కళాశాల పేరు మీద వేయగా ప్రత్యామ్నాయంగా 2వ బిడ్ తన పేరు మీద వేశారని అమర కళాశాలకు చెందిన భూములు భవనం కొలతలు తానే దగ్గరుండి చూసుకున్నారని పేర్కొన్నారు. కళాశాల చైర్మన్ గా వ్యవహరిస్తున్న బొల్లా బ్రహ్మనాయుడు కళాశాల వ్యవహారాలలో జోక్యం చేసుకోరని కళాశాల కరస్పాండెంట్ కీలకంగా వ్యవహరిస్తూ కళాశాల నిర్వహిస్తున్నారని అన్నారు. గత ఎన్నికలలో చంద్రబాబు నాయుడు కి కూడా పెట్టుబడి పెట్టిన వ్యక్తి రావెల సత్యనారాయణ అని నరసరావుపేట, సత్తెనపల్లి , చిలకలూరిపేట, నియోజకవర్గాలలో ఒక సీటు ఇవ్వాలని చంద్రబాబు చుట్టూ తిరుగుతున్నారన్నారు.ప్రతి విషయాన్ని వైసిపికి ఆపాదించడం చదలవాడకు సరికాదని విమర్శించారు.



నివాళులర్పిస్తున్న చదలవాడ అరవిందబాబు

'అమర ఆత్మహత్యపై విచారణ జరపాలి'

అమరా వెంకటేశ్వరరావు ఆత్మహత్య పై నరసరావుపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవింద బాబు విచారం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ అమరా వెంకటేశ్వరరావు ఎంతో సౌమ్యుడని అమరా కళాశాలకు సంబంధించి ఆయన 2011లో కెనరా బ్యాంక్ నుండి కళాశాల ఏర్పాటుకు నిర్వహణకు రూ.13 కోట్లు అప్పు తీసుకోవడం జరిగిందన్నారు. ఆ అప్పుకు సంబంధించి 2017 వరకు ఆయన రూ.26 కోట్లు చెల్లించారన్నారు. అయినప్పటికీ బ్యాంక్ అధికారులు,అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు బ్యాంక్ ఆక్షన్ లో తక్కువ ధరకు దక్కించుకున్నారని బ్యాంక్ ఉన్నతాధి కారులను సంప్రదించినా ఫలితం లేకపోవడంతో తీవ్ర మన స్తాపానికి గురైన ఆయన పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారని తెలిపారు. ఆయన మరణం వెనుక ఉన్నవారి పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.అప్పుపై చక్ర వడ్డీలు వేసి ఆయనను వేధించారని,ఆయన కుటుంబ సభ్యులకు తీవ్ర మన స్థాపం కలుగజేశారన్నారు. బ్యాంక్ ఆక్షన్ సైతం అధికార పార్టీ వారికి అనుకూలంగా బ్యాంక్ అధికారులు చేశారని,ఇందుకు పూర్తి బ్యాంక్ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుం దన్నారు. నరసరావుపేట ఒక మంచి ఆర్యవైశ్య ప్రముఖుడిని, వ్యాపారిని కోల్పోయిందన్నారు. వెంకటేశ్వరరావు కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులతో సమీక్ష

ప్రజాశక్తి - నరసరావుపేట

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి సాగు చేసి పండించిన పంటలను ఆహారంలో తీసు కోవాలని పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమ కుమారి సూచించారు. మంగళవారం స్థానిక కార్యా లయంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రోగాల బారిన పడకుండా, పర్యావరణం దెబ్బతినకుండా భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన ప్రకృతి వనరులను అందించేలా కృషి చేయాలని కోరారు.

వడ్డీ లేని రుణాలు అభినందనీయం

ప్రజాశక్తి - మంగళగిరి

ఇస్లామిక్ షరియత్ ప్రకారం ఖిద్మత్ బ్యాంక్ పేద వారికి వడ్డీ లేని రుణాలు అందించడం అభినందనీయని ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవి కొనియాడారు. స్థానిక ఖిద్మత్ బ్యాంకులో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 12 మంది ఖాతాదారులకు రూ.5.70 లక్షల వడ్డీ లేని రుణాలను అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో గంజి చిరంజీవి మాట్లాడుతూ ఖిద్మత్ బ్యాంకు సామాన్యుల బ్యాంకు అని, అర్హులైన ఖాతాదారుకు వడ్డీ లేని రుణా లను అందిస్తూ సహాయం పడుతోందని, ఈ రుణాలతో పేదలు చిరు వ్యాపారం చేసుకుంటూ లబ్ధిపొందవచ్చని చెప్పారు. ఒక్క రోజు ఆనందం కోసం పార్టీల్లో డబ్బు వృథా చేయకుండా పేదవారికి ఉపయోగపడే ఖిద్మత్ బ్యాంకులో డిపాజిట్ చేస్తే బాగుంటుందని సూచిం



చారు. ప్రతి ఒక్కరూ మంచి ఆలోచనతో ముందుకు సాగి నప్పుడే సమాజంలో గొప్ప మార్పు వస్తుందన్నారు. 'ఖిద్మత్' సేవలు రోజు రోజుకూ విస్తరిస్తున్నాయని, ఈ బ్యాంకుకు ప్రభుత్వపరంగా సహకరించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ రఫీ, ప్రతినిధులు ఎస్ కె సంధాని, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.



6న కలెక్టరేట్ వద్ద అంగన్వాడీల ధర్నా

ప్రజాశక్తి-దుగ్గిరాల

అంగన్వాడీ వర్కర్సు అండ్ హెల్పర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఈమని ప్రాజెక్టు సిడిపిఒకు వినతిపత్రం అందజేశారు. ఫిబ్రవరి 6వ తేదీన గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26,000, ఇఎస్ఐ, గ్రాడ్యూటి , పెన్షన్ మంజూరు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అద్దె భవనాల్లో కొనసాగుతున్న కేంద్రాలకు అద్దె, కరెంట్ బిల్లులు చెల్లించాలని, జిఒ నంబర్ 1ను రద్దు చేయాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో సిఐటియు మండల ఉపాధ్యక్షులు జెట్టి బాలరాజు, అధ్యక్షులు జయ ఆదిలక్ష్మి రమణమ్మ పాల్గొన్నారు.



రంగస్థల కళాకారుడు సుబ్బారావుకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక బోస్ రోడ్డులోని పెమ్మసాని థియేటర్లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారథ్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఎన్టీఆర్ నటించిన 'యుగపురుషుడు' చలన చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. కళా కారులకు సత్కారాలలో భాగంగా ప్రముఖ పౌరాణిక నాటక కళా కారుడు నక్క సుబ్బారావును సత్కరించారు. కార్యక్రమంలో గంటా శివరావు, పరుచూరి శివరాం ప్రసాద్, కె రమేష్ బాబు, పి నాగమనేంద్రరావు, సూర్యనారాయణ, టి.శివాని, పి.పోతురాజు ఎం. రాఘవరావు, పాల్గొన్నారు.



యర్రబాలెం లో రూ.9.90 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి-తాడేపల్లి నగర పరిధిలోని యర్రబాలెం గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలోని ఓ రోడ్డు చిన్నపాటి వర్షానికే బురదమయమవతుంది. పెద్ద వర్షం కురిస్తే ఆ రహదారిపై వర్షపు నీరు నిలిచి చెరువును తలపించేది. వర్షాకాలంలో రాకపోకలకు స్థానికులు ఎంతో ఇబ్బందులు పడ్డారు. కొన్నేళ్ల క్రితం స్థానికులు రోడ్డుపై నిలిచిన బుర దలో వరినాట్లు వేసి నిరసన చేపట్టిన సందర్భంగా ఉంది. దీనిపై స్పందించిన అధికారులు సమస్య పరిష్కరిస్తామని స్థానికులకు హామీ ఇచ్చి, ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఆళ్ల రామ కృష్ణారెడ్డి (ఆర్కె) దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన నిధుల లభ్యత మేరకు సిసి రోడ్డు నిర్మించాలని అధికారులకు సూచించారు. దీంతో, సుమారు రూ.5 లక్షలతో కొంత మేరకు సిసి రోడ్డును అధికారులు నిర్మించారు. తాజాగా, రెండవ విడతలో సుమా రు రూ.10 లక్షల నిధులతో మిగిలిన సిసి రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. స్థానిక పెద్దల చేతులు మీదుగా మంగళవారం శంకుస్థాపన చేశారు. సిసి రోడ్డు నిర్మాణం చేపట్టి తమ రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేసిన ఎమ్మెల్యేకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు జి. శ్రీనివాసరావు, పి.కోటేశ్వరరావు, డి.నాగయ్య, ఆర్.గోపి, నాయుడు హనుమంతరావు, ఆలా శివాజీ, బడేమియా తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఆర్ఐ వైద్యురాలికి సన్మానం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజ్ గైనకాలజి డిపార్టు మెంట్లో సీనియర్ వైద్యులు, విభాగాధిపతి డాక్టర్ ప్రభాదేవి మంగళవారం పదవీ విరమణ చేశారు. ఈ సంద ర్భంగా ఆమెను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. వక్తలు మాట్లా డుతూ దాదాపు దశాబ్దం పైగా ఎన్నారై అకాడమీ ఆఫ్ సైన్సెస్ లో వైద్య విద్యా ర్థులకు, ప్రజలకు విశిష్టమైన సేవలు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీ, సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, సెక్రెటరి వెంకటేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కుమార్ చౌదరి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రబోధ్ పాల్గొన్నారు.

పదవీ విరమణ చేసిన ఆయాకు, అవార్డు గ్రహీతకు సత్కారం

ప్రజాశక్తి- పెదనందిపాడు రూరల్

ఐసిడిఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్ట్ పరిధిలో పెదనందిపాడు మండలం పమిడి వారి పాలెం ఎస్సీ అంగన్వాడి సెంటర్లో ఇరవై రెండేళ్లుగా ఆయాగా పని చేస్తున్న ఎడ్లూరి ఇందిరమ్మ మంగళవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంగన్వాడి సిబ్బంది, ఆమెను సత్కరించారు. ఉత్తమ అంగన్వాడి కార్యకర్తగా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న అన్నపర్రు మెయిన్ అంగన్వాడీ సెంటర్లో కార్యకర్త ఉప్పుగుండూరి శ్రీదేవిని కూడా ఇదే కార్యక్రమంలో సత్కరించారు. కార్యక్రమంలో సిడిపిఒ సుజాతదేవి, సూపర్వైజర్లు భారతీదేవి, జరీనా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.





ఎన్ఆర్ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్లో వర్క్షాప్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

చినకాకాని ఎన్ఆర్ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్లో 'హాండ్స్ ఆన్ - అప్పర్ గ్యాస్ట్రో ఇంటెస్టైనల్ ఎండోస్కోపి' అనే అంశంపై మూడు రోజుల వర్క్ షాప్ మంగళవారం ప్రారంభమైంది. జనరల్ సర్జరీ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో సర్జికల్ స్కిల్ ల్యాబ్లో ఈ అంశంపై సీనియర్ వైద్యులు ఎండోస్కోపి ప్రాముఖ్యతను పిజి విద్యార్థులకు వివరించారు. గత ఏడాదిగా ఈ వర్క్షాప్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పిగ్ స్టమక్ మోడల్స్పై విద్యార్థులకు అవగాహన కల్పించి, సీనియర్ వైద్యుల పర్యవేక్షణలో వాటి పనితీరును ప్రాక్టికల్ చేయించారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ శివశంకర్, డాక్టర్ సుష్మా, డాక్టర్ అనురూప్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ మల్లిఖార్జునరెడ్డి, డాక్టర్ ప్రసన్నకుమార్, డాక్టర్ మోయిన్, డాక్టర్ దినకర్ రెడ్డి, డాక్టర్ పవన్ అడ్డాల, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.



గ్యాస్ వినియోగంలో ప్రమాదాల నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి-తెనాలిరూరల్

వంట గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు తీసు కోకుంటే ప్రమదాల బారిన పడతారని చెంచుపేటకు చెందిన ఇండియన్ ఎంటర్ప్రైజెస్ అధినేత మురళీ చెప్పారు. స్థానిక కేఎస్ఎం హైస్కూల్లో ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో మంగళారం విద్యార్థులకు 'సురక్ష-సమృద్ధి'పేరిట గ్యాస్ వినియోగం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సిలెండర్ నుంచి గ్యాస్ పంపిణీ చేసే ట్యూబ్ హార్డ్ కాకుండా చూసుకోవాలన్నారు. వంట పూర్తయిన వెంటనే రెగ్యులేటర్ విధిగా ఆఫ్ చేయాలన్నారు. స్టౌపై ఉన్న పాత్ర పరిమాణాన్ని బట్టి ఫ్లేమ్ ఉపయోగించటం ద్వారా గ్యాస్ ఆదా అవుతుందన్నారు. ఏదైనా ప్రమాదం జరిగినపుడు వెంటనే తెలియచేయాల్సిన టోల్ఫ్రీ నంబర్లను వివరించారు. కరపత్రాలను విద్యార్థులు అందించారు. విద్యార్థులు తెలుసుకున్న విషయాలను ఇళ్ళలో అవగాహన కల్పించి, ప్రమాదాలను నియంత్రించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజారెడ్డి, కోగంటి వెంకట్రావ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





అంగన్వాడి కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం కార్యాలయం పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో పర్యవేక్షకులు, కార్యాలయం అధికారి పిపిజి ప్రసూన మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. తనిఖీలలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న స్టాక్ ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వైఎస్సార్ సంపూర్ణ పౌష్టికాహారం, బాలామృతం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. బాలామృతం పిల్లలకు సక్రమంగా ఇవ్వడం వలన పోషణ జరిగి, ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడు తుందని వివరించారు



అమరావతి క్లబ్ విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి - మంగళగిరి

జనవరి 29, 30 తేదీలలో అనకాపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి టైక్వాండో పోటీల్లో మంగళగిరికి చెందిన అమరావతి క్లబ్ విద్యార్థులు పతకాలు సాధించారు. క్యాడెట్ బాయ్స్ విభాగంలో లక్ష్మీ నరసింహ, బాలాజీశ్వర్, అక్షిత్ కుమార్, వర్షిత్ కుమారులు కాంస్య పతకాలు, మోహినిష్ వెండి పతకం సాధించారు. జూనియర్ విభాగంలో వినోద్ కాంస్య పతకం సీనియర్ విభాగంలో హారిక సౌజన్య బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధిం చింది. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను మంగళవారం మంగళగిరి టౌన్ సిఐ అంకమరావు అభినందించారు. వారికి నగదు బహుమతిని అందజేశారు.



ఫిల్టర్ బావుల మరమ్మతుల కోసం అధికారుల పరిశీలన

ప్రజాశక్తి - పెదనందిపాడు


నాగులపాడులో ఫిల్టర్ బావుల మరమ్మతుల కోసం ఆర్డబ్ల్యూఎస్ అధికారుల బృందం మంగళవారం పరిశీలించింది. వీటి మరమ్మతుల నిమిత్తం నాగులపాడు గ్రామస్తుడు, ఎన్ఆర్ఐ ఆళ్ల వెంకట సుబ్బారావు తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా వెంకట సుబ్బారావు మాట్లాడుతూ గ్రామంలో తాగు నీటి సమస్యను పరిష్కరించేందుకు తన వంతు సహాయం అందించానని అన్నారు. గ్రామంలోని ఇతర సమస్యల పరిష్కారం కోసం కూడా గ్రామ పెద్దలను, అమె రికాలోని తన స్నేహితులను కలుపుకొని ముందుకు వెళతానని చెప్పారు. కార్య క్రమంలో ఆర్డబ్ల్యూఎస్ డీఈ ఏవిఎల్ ప్రసాద్, ఏఈ సిహెచ్ రాజేష్, కార్యదర్శి బి.నాగయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సౌమ్య, ఎ.భాస్కరరావు, పి.రాం బాబు తదితరులు పాల్గొన్నారు.

న్యాయస్థానాలపై నమ్మకం ఉంది

మంగళగిరి కోర్టుకు హాజరైన నన్నపనేని రాజకుమారి



ప్రజాశక్తి - మంగళగిరి :న్యాయస్థానాలపై తనకు నమ్మకం ఉందని మాజీ మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ నన్నపనేని రాజకుమారి అన్నారు. మంగళవారం మంగళగిరి కోర్టుకు హాజరయ్యారు. మంగళగిరిలో విలేకరులతో మాట్లాడారు. రెండేళ్ల క్రితం చంద్రబాబు ఇంటికి వెళ్లేటప్పుడు అధికారులు వెళ్లనివ్వ కుండా అడ్డుకోవడం జరిగిందని, దీనిపై అధికారుల విధులకు ఆటంకపరిచారని కేసు పెట్టారని అన్నారు. దీనిపై హాజరయ్యేందుకు వృద్ధాప్యంలో కూడా రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. 75 సంవత్సరాలు వయసులో రావడం ఇబ్బందిగానే ఉందని, కానీ ఇక్కడకు వచ్చిన తర్వాత అమరావతి రైతులను ఉద్యమ నాయకులను కలిశారని అన్నారు. వారిని చూసిన తర్వాత ఇబ్బంది పోయిందని అన్నారు. రాజధానికి భూములు ఇచ్చిన రైతులు పైనే ఈ ప్రభుత్వం కేసులు పెట్టిందన్నారు. అయితే న్యాయస్థానాలపై తనకు నమ్మకం ఉందని అన్నారు. రాజధాని రైతులు రాజధాని కోసం భూములు ఇచ్చి త్యాగాలు చేశారని అన్నారు. ఎప్పటికైనా వారు విజయం సాధిస్తారని అన్నారు. కరోనా కాలంలో కరోనా గుర్రై మరల ఆరోగ్యంగా ఉన్నాయని అన్నారు. కానీ సోషల్ మీడియాలో తనపై అనారోగ్యంగా ఉన్నానని పెట్టడం బాధగా అనిపించింది అని అన్నారు. బాగా లేకపోతే ఇక్కడదాకా రాలేను కదా అన్నారు. నిరాధారమైన వాటిని సోషల్ మీడియాలో పెట్టకూడదని అన్నారు. వాస్తవాలు పెట్టాలని అన్నారు. అదేవిధంగా లోకేష్ పాదయాత్ర విజయవంతం కావాలని అన్నారు. తారకరత్న కోలుకోవాలని అన్నారు.



విజేత విజ్ఞాన్ జట్టుకు కప్ అందజేస్తున్న రాయపాటి శ్రీనివాస్, మురళిమోహన్ తదితరులు

చందూస్ సిల్వర్ కప్ విజేతగా విజ్ఞాన్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జేకేసీ కళాశాల ఆధ్వర్యంలో అధ్యాపకుల కోసం నిర్వహించిన 26వ చందూస్ సిల్వర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా విజ్ఞాన్స్ యూని వర్సిటీ నిలిచింది. కళాశాలలోని క్రికెట్ గ్రౌండ్‌లో మంగళవారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ జట్టు భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఎస్ఆర్‌కేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 119 పరుగులు చేసింది. తర్వాత బరిలోకి దిగిన విజ్ఞాన్స్ జట్టు 15.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 123 పరుగులు సాధించి విజయాన్ని సొంతం చేసుకుంది. టోర్నీలో బెస్ట్ బ్యాట్స్‌మెన్‌తో పాటు మ్యాన్ ఆఫ్ ద టోర్నమెంట్‌గా విజ్ఞాన్‌కు చెందిన మాదినేని లోకేష్, టోర్నీలో బెస్ట్ బౌలర్‌గా విజ్ఞాన్‌కు చెందిన కెప్టెన్ శ్రీకాంత్ నల్లపనేని నిలిచారు. ముగింపు కార్యక్రమానికి నాగార్జునా ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు రాయపాటి శ్రీనివాస్, జెకెసి కాలేజి సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ జాగర్లమూడి మురళిమోహన్, విజేతలకు బహుమతులు అందచేశారు. చందూస్ సిల్వర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలుగా నిలిచిన క్రికెట్ టీమ్ సభ్యులను విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.



కిట్స్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు

ఇన్నోవేషన్‌పై అవగాహనా తరగతులు

ప్రజాశక్తి-గుంటూరు

వింజనంపాడులోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో కిట్స్ ఇంజినీరింగ్ కాలేజి ఆధ్వర్యంలో మంగళవారం తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు అవేర్‌నెస్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విభాగాధిపతి డాక్టర్ జి.మురళి, ఇన్నోవేషన్ కన్వీనర్ డాక్టర్ ఎస్.నాగేంద్రం, ఆవిష్కార్ క్లబ్ కోఆరిడనేటర్ డాక్టర్ ఎస్.రాధాకృష్ణ, స్టూడెంట్ కోఆర్డినేటర్ డి.హరికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో ఇలాంటి కార్యక్రమాలు నూతన ఆలోచనలకు, వాటి ఆవిష్కరణలకు ఎంతో ఉపయోగపడతాయని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కళ్యాణి పేర్కొన్నారు. కళాశాల ఛైర్మన్ కోయి సుబ్బారావు నూతన ఆవిష్కరణలతో విద్యార్థులు ఎవరైనా ముందుకు వస్తే వారికి కావాల్సిన ఆర్థిక సహాయాన్ని అందిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను, అధ్యాపకులను కళాశాల సెక్రెటరీ కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ కె.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అడ్వర్టైజింగ్ బోర్డు ఫీజులు వసూళ్లకు కార్యాచరణ

నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో బకాయి ఉన్న అడ్వర్టైజింగ్ బోర్డు, హెూర్డింగ్ ఏజన్సీల నుండి మీడియా డివైజ్ డిస్‌ప్లే ఫీజులు వెంటనే వసూళ్లకు కార్యాచరణ సిద్ధం చేయాలని, ఏసిపి, టిపిఎస్‌ల వారీగా లక్ష్యాన్ని నిర్దేశించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు.మంగళవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్‌హాల్లో పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మీడియా డివైజ్ ఫీజుల వసూళ్లలో పురోగతి లేదని, ప్రత్యేక బందాల ద్వారా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని, ఫీజులు చెల్లించని వారి బోర్డులను తొలగించాలని స్పష్టం చేశారు. టిపిఎస్‌లు, ఏసిపిల వారీగా బకాయిల వసూళ్లకు లక్ష్యాన్ని నిర్దేశించాలన్నారు. అలాగే బోర్డులకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయాలని, ప్రతి బోర్డుకు జియోట్యాగ్‌లను రానున్న వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు.నగరంలో ఉన్న అనధికార లేఅవుట్స్‌ని ఇన్ ప్రిన్సిపుల్ లే అవుట్స్‌గా అప్లై చేయించాలని, వాటికి అనుమతులు వస్తేనే నూతన భవన నిర్మాణ అనుమతులు ఇవ్వడానికి వీలు కలుగుతుందన్నారు. రోడ్డు విస్తరణ పనులను సమీక్షించి ప్రధాన రహదారుల విస్తరణ పనులు దాదాపు పూర్తి అయ్యాయని, ఇంకా ఏమైనా పెండింగ్ ఉంటే రెండ్రోజుల్లో పూర్తి చేయాలన్నారు. విస్తరణ పనులు జరిగిన ప్రాంతాల్లో డ్రైన్లు, రోడ్ల నిర్మాణంపై ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. నూతనంగా విస్తరణ పనులు చేపట్టే ప్రాంతాల్లో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల గోడలు, పబ్లిక్ ప్రాంతాల్లో వాల్ పోస్టర్లు అంటించే వారిపై పోలీసు కేసు నమోదు చేయడంతో పాటు, భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, ఏసిపిలు కాలేష, బాబురావు, అశోక్‌కుమార్, అజయ్‌కుమార్, సూపరింటెండెంట్ ప్రసాద్, సర్వేయర్ సునీల్ కుమార్, టిపిఎస్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం : మంత్రి రజని

గుంటూరులో డ్రగ్స్ డిడి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో పేద ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలను మరింత మెరుగుపరుస్తున్నట్టు మంత్రి విడదల రజనీ తెలిపారు. మంగళవారం గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ఆవరణలో రూ.1.30 కోట్లతో నూతనంగా నిర్మించిన ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ ఉప సంచాలకులు వారి కార్యాలయాన్ని విడదల రజిని ప్రారంభించారు. శాసన సభ్యులు మద్దాలిగిరిధర రావు అధ్యక్షతన జరిగిన సభలో విడదల రజిని మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఔషధ నియంత్రణ శాఖ కార్యాలయాలు నిర్మించేందుకు వీలుగా రూ.53 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. ఇప్పటి వరకు రూ.6 కోట్ల 50 లక్షల వ్యయంతో నిర్మించిన 12 ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ కార్యాలయాలను ప్రారంభించినట్టు తెలిపారు. వైద్య ఆరోగ్య రంగంలో పెద్ద ఎత్తున సంస్కరణలు తీసుకువచ్చి, గ్రామ స్థాయిలో ప్రతి సచివాలయ పరిధిలో వైయస్సార్ విలేజ్ క్లినిక్స్, ఏరియా ఆసుపత్రులు, మల్టీ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతున్నదన్నారు. నాడు నేడు క్రింద మౌళిక సదుపాయాలూ కల్పించడంతో పాటు, దాదాపు 40 వేల మంది వైద్య సిబ్బందిని నియమించామన్నారు. మార్కెట్, మందుల షాపులో కాలం చెల్లించిన మందులను నియంత్రించడం కోసమే ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ కార్యాలయాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డైరెక్టర్ జనరల్, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ యస్. రవిశంకర్ నారాయణ్ మాట్లాడుతూ ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ చరిత్రలో గుర్తుండి పోయే రోజని, ఒకేసారి 12 భవనాలను ప్రభుత్వ సహకారంతో ప్రారంభించుకోవడం సంతోషమన్నారు. ఔషధ నియంత్రణ కార్యాలయాలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న కషికి అనుగుణంగా ఔషధ నియంత్రణ శాఖ మార్కెట్ లో చలామణి అయ్యే నకిలీ, కాలం చెల్లిన, నకిలీ మందుల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణ బాబు, డైరెక్టర్ జనరల్, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ యస్. రవిశంకర్ నారాయణ్, జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, శాసన మండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి, శాసన సభ్యులు షేక్. ముస్తఫా, గుంటూరు రీజియన్ యం.పి. ఆర్. ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. హనుమంతరావు, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ సజీలా, డిసిసిబి బ్యాంకు ఛైర్మన్ లాల్ పురం రాము తదితరులు పాల్గొన్నారు.



పటిష్టంగా గ్రంథాలయాల అభివృద్ధి

అసలైన జర్నలిస్టులు ఎవరో యూనియన్లు చెప్పాలి

ఎపి ప్రెస్ అకాడమి ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయాలను పటిష్టంగా అభివద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మంగళగిరి లోని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ మందపాటి శేషగిరిరావును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో గ్రంథాలయానికి వచ్చే సెస్‌ను పక్కదారి మళ్ళించారని, పుస్తకాలు కొనుగోలు చేయలేదన్నారు. అదే నేడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో గ్రంథాలయాలకు వచ్చే సెస్‌ను గ్రంథాలయాలే ఉపయోగించు కునేలా చర్యలు తీసుకున్నారన్నారు. కొత్త పుస్తకాలు కొనడం, గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేస్తున్నారన్నారు. గ్రంథాలయాలకు పిల్లలను పంపించేందుకు తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ప్రెస్ అకాడమీ తరపున సీనియర్ జర్నలిస్ట్‌లు రాసిన పుస్తకాలను పబ్లిష్ చేయాలని ప్రెస్ అకాడమి తలంపుతో ఉందన్నారు. నేడు పత్రిక విలేకర్ల వ్యవస్థ అధ్వాన్నంగా ఉందని, నిజమైన జర్నలిస్టులు ఎవరనేది చెప్పలేకపోతున్నా మన్నారు. స్మార్ట్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ జర్నలిస్ట్‌గానే ఉంటున్నారని తెలిపారు. ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల మైకులకు కొన్నింటికి వైర్లు ఉంటున్నాయని, మరికొన్నింటికి ఉండటం లేదని వాటిలో తేడా ఏంటో అర్థం కావటం లేదన్నారు. దీనిని యూనియన్ నాయకులే పరిశీలించాలన్నారు. అన్నిటికంటే ముందుగా జర్నలిస్టులో ఏకాభిప్రాయం రావాలని అసలు జర్నలిస్టులు ఎవరు అనేది సంబందిత యూనియన్ నాయకులే గైడ్లైన్స్ ఇవ్వాలని వారు గైడ్లైన్స్ ఇవ్వకుండా మేము మాత్రం ఏం చేయగలమన్నారు. జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం అభిమానంతో వ్యవహరిస్తుందని ఇళ్ల స్థలాల విషయం కూడా పరిశీలనలో ఉందని అక్రిడేషన్ మరో మూడు నెలల సమయం కొనసాగిస్తూ రెన్యువల్ చేసారని, జర్నలిస్టుల హెల్త్ ఇన్సూరెన్స్ సంబంధించి జీవో కూడా జారిచేసిందని వివరించారు. రాష్ట్ర గ్రంథాలయ ఛైర్మన్ మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అమలవుతుందన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మినేని, మందపాటి